# 30 రోజులు.. 21 సందర్శనలు



ఇందిరమ్మ ఇండ్లను పరిశీలిస్తున్న కలెక్టర్ (ఫైల్)

- కలెక్టర్ విజయేంద్ర బోయి నిత్యం తనిఖీలు
- అధికారుల్లో తగ్గిన అలసత్వం
- పెరిగిన జవాబుదారితనం
- విద్యాలయాల్లో మెరుగైన భోజనం, వసతులు
- కలెక్టర్ పర్యటనతో జిల్లాలో అభివృద్ధి పనుల్లో వేగిరం

**ఆమె వైద్యురాలిగా మారి వ్యాదిగ్రస్తుల బాధలు తెలుసుకుంటారు.. దవాఖానాలో వసతులపై ఆరా తీస్తారు..మరుసటి రోజు పాఠశాలకు వెళ్లి పంతులమ్మ గా మారి విద్యార్థులకు బోధిస్తారు.. ప్రతిరోజు ఏదో ఒక విద్యాలయాల్ని తనిఖీ చేస్తూ విద్యా వ్యవస్థను గాడిలో పెడుతుంటారు.. ఇంకో రోజు కార్యాలయాలు తనిఖీ చేసి అధికారుల పనితీరును సమీక్షిస్తారు..నిరక్ష్యం వహిస్తే అధికారులను హెచ్చరిస్తారు.. ఇలా ఒక్కటేమిటి నిత్యం సందర్శనలు ..తనిఖీలు నిర్వహిస్తూ జిల్లాను అభివృద్ధి పథంలో నడుపుతూ ప్రభుత్వ పథకాలను క్షేత్రస్థాయిలో అమలుపరుస్తూ.. తనదైన శైలిలో ముందుకు వెళ్తున్నారు జిల్లా బాస్, మెజిస్ట్రేట్, కలెక్టర్ విజయేంద్ర బోయి. నెల రోజుల వ్యవధిలోనే 21రోజులు వివిధ కార్యాలయాలు, విద్యాలయాలు,గ్రామాలను తనిఖీ చేసి అందరినీ ఆశ్చర్య పరుస్తూ అడ్మినిస్ట్రేషన్‌లో తనదైన మార్క్‌ను చూపిస్తున్నారు. పథకాలు, పనులు కాగితాల మీద ఉండడం కాదు క్షేత్ర స్థాయిలో ప్రజలకు చేరాలనే లక్ష్యంతో జిల్లా బాస్ నిత్యం శ్రమిస్తున్నారు.**

- మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్ 8 ప్రభాతవార్త

జడ్చర్లలో రైల్వే స్టేషన్‌లో యూరియా నిల్వలపై ఆరా తీస్తూ..

విద్యా, వైద్యం, ఆరోగ్యం మోలిక వసతుల కల్పనకు సంబంధించి నిత్యం ఏదో ఒక ప్రాంతంలో తన కీలు నిర్వహిస్తూ అధికారుల పనితీరును పర్యవేక్షిస్తూ, అవసరమైన చోట నోటీసులు జారీ చేస్తూ, అధికారులను హెచ్చరిస్తూ అభివృద్ధి పనులు పథకాలు అమలుకు నిత్యం కృషి చేస్తున్నారు కలెక్టర్ విజయేంద్ర బోయి. కేంద్ర రాష్ట్రస్థాయి పథకాల అమలుకు, క్షేత్రస్థాయిలో పనుల్లో జాయిన్ జరగకుండా కలెక్టర్ పర్యటనలు దోహదం చేస్తున్నాయి. జిల్లా కలెక్టర్లు నిత్యం క్షేత్ర స్థాయిలో పర్యటిస్తూ ప్రజలకు ప్రభుత్వం పథకాలను చేరవేయాలని, విద్యాలయాల్లో తనిఖీలు నిర్వహించిన మెరుగైన బోధన, నాణ్యమైన ఆహారం అందేలా చూడాలని సీఎం రేవంత్‌రెడ్డి కలెక్టర్ల సమీక్షలో ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈక్రమంలో మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేంద్ర బోయి తూ.చ తప్పకుండా సీఎం ఆదేశాలను పాటిస్తున్నారు. నిత్యం తనిఖీలు నిర్వహిస్తూ అభివృద్ధి, సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు చేరవేసేలా తనదైన శైలిలో ముందుకు వెళ్తున్నారు.

### కలెక్టర్ తనిఖీలు..

- ఇందిరమ్మ ఇండ్ల పథకాల అమలుకు సంబంధించి క్షేత్రస్థాయిలో లబ్ధిదారులను కలిసి వారితో మాట్లాడి నిర్మాణంలో లోపాలు ఉన్న ఇబ్బందులను తెలుసుకొని పలు సూచనలు సలహాలు జారీ చేస్తున్నారు.

- విద్యాలయాల్లో ఆహార నాణ్యత విషయంలో ఎక్కడ ఇబ్బందులు రాకుండా రాజీ పడకుండా ఉండేందుకు ఇప్పటికే చాలా గురుకులాలు, కస్తూర్బాలు పాఠశాలలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం సమయంలో వెళ్లి విద్యార్థులతో పాటు కలిసి భోజనం చేశారు.

- ఇటీవల రైతులకు యూరియా ఇబ్బందులు ఏర్పడిన దృష్ట్యా కొరతను అధిగమించేందుకు, ఇబ్బందులను తొలగించేందుకు ఎప్పటికప్పుడు వ్యవసాయ అధికారులతో కలిసి ఆరా తీశారు. జడ్చర్ల తో పాటు పలు ప్రాంతంలో స్టాక్ పాయింట్లను చెక్ చేసి అన్ని మండలాలకు సమానంగా యూరియా సరఫరా అయ్యేలా చర్యలు చేపట్టారు.
- వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు వ్యాప్తి చెందకుండా నిత్యం సమీక్షిస్తూ, క్షేత్రస్థాయిలో పరిశుభ్రతపై తనిఖీలు నిర్వహిస్తూ అధికారులకు ఆదేశాలు సూచనలు జారీ చేస్తున్నారు. ఇండ్ల మధ్య చెత్త పేరుకు పోకుండా ఉండేందుకు యజమానులకు నోటీసులు జారీ చేయిస్తున్నారు.
- జిల్లా దవాఖానతోపాటు, పీహెచ్‌సీలను ఆకస్మికంగా తనిఖీ చేస్తున్నారు. నిర్లక్ష్యపు అధికారుల గుండెల్లో రైల్లు పరుగెత్తిస్తున్నారు. దవాఖానలో వసతులు, పారిశుధ్యం, రోగుల సేవలపై ప్రత్యక్షంగా మాట్లాడుతూ అవసరమైన చోట నోటీసులు సైతం జారీ చేస్తున్నారు.
- కార్యాలయాలు విద్యాలయాలు తనిఖీ చేసినప్పుడు రిజిస్టర్లను పరిశీలిస్తూ అధికారుల పనితీరును ఆరా తీయడంతో కొంతమేరకు భయం ఏర్పడి విధుల నిర్వహణలో అలసత్వం తగ్గినట్లు తెలుస్తుంది.

మహబూబ్‌నగర్ వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట





వీసీలో పాల్గొన్న కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా అధికారులు

## రైతు సంక్షేమంలో నాగర్‌కర్నూల్ ముందంజ

- 11న పాలెం వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ధన్ ధాన్య కృషి యోజన కార్యక్రమం ప్రారంభం
- ఏర్పాట్లు పూర్తి చేయాలని నాగర్‌కర్నూల్ కలెక్టర్ బాదావత్ సంతోష్ ఆదేశం

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, అక్టోబర్ 8 ప్రభాతవార్త:** ఈ నెల 11న ప్రధానమంత్రి ప్రారంభించే ప్రధానమంత్రి ధన్ ధాన్య కృషి యోజన కార్యక్రమాన్ని పాలెం వ్యవసాయ విశ్వవిద్యాలయంలో ఏర్పాట్లు చేయాలని నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్ జిల్లా వ్యవసాయ, మత్స్య, ఇరిగేషన్, హార్టికల్చర్, అగ్రికల్చర్ మార్కెటింగ్, నీటిపారుదల తదితర శాఖల అధికారులతో సమావేశమై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రధాన మంత్రి ధన్ ధాన్య కృషి యువజన పథకం కార్యక్రమానికి నాగర్‌కర్నూల్ జిల్లా ఎంపిక కావడం గర్వకారణమని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని జిల్లాను రాష్ట్రం మరియు దేశంలో మోడల్ జిల్లాగా నిలపాలని సూచించారు. ఈ పథకం కింద రైతుల ఆదాయాన్ని పెంచడం, పంట ఉత్పత్తి మరియు మార్కెటింగ్ వ్యవస్థలో నూతన ఆవిష్కరణలు చేపట్టడం, నీటివనరుల సమర్థ వినియోగం, మత్స్య మరియు పశుసంవర్ధక రంగాల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ప్రభుత్వం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిందని వివరించారు. అందువల్ల ప్రతి శాఖ తమ భాగస్వామ్య బాధ్యతను గుర్తించి, సమన్వయంతో యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆయన ఆదేశించారు. వివిధ శాఖల సమిష్టి కృషి ద్వారా ఈ పథకాన్ని -మిగతా4లో..

## అనుమానమే ప్రాణం తీసింది

**కత్తితో పొడిచి..గొంతు కోసి..**

భార్యను దారుణంగా హతమార్చిన భర్త
నిందితుడు రిమాండ్‌కు తరలింపు
డీఎస్పీ నల్లపు లింగయ్య వెల్లడి

4




వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ లింగయ్య

## ఆగిన వలస ఊపిరి..

- బిడ్డ ఆరోగ్యం కోసం రుణం..
- అప్పు తీర్చేందుకు బొంబాయికి వలస

**నారాయణపేట టౌన్, అక్టోబరు8, ప్రభాతవార్త:** బతుకు దెరువు కోసం వెళ్లి వలస కూలి మృతి చెందిన సంఘటన బుధవారం నారాయణపేట జిల్లా కోటకొండ గ్రామంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. కోటకొండకు చెందిన కావలి యాదప్ప కొన్ని రోజుల కిందట బతుకు దెరువు కోసం బొంబాయికి వలస కార్మికుడిగా -మిగతా4లో..

## తాగి వేధిస్తున్నాడని.. చంపేసింది

- భర్తను హతమార్చిన భార్య
- తమ్ముళ్లతో కలిసి పక్కా ప్లాన్
- ఐదుగురు నిందితులు అరెస్ట్
- వివరాలను వెల్లడించిన వనపర్తి డిఎస్పి వెంకటేశ్వరరావు

4




వివరాలు వెల్లడిస్తున్న వనపర్తి డీఎస్పీ వెంకటేశ్వర్లు

## దీపికకు పూర్తి సహకారం అందిస్తా..

- అభినందించిన మంత్రి జూపల్లి హామీ
- జాతీయ స్థాయి షూటింగ్ పోటీలకు ఎంపికైన కొల్లాపూర్ క్రీడాకారిణి

**కొల్లాపూర్, అక్టోబరు 8, ప్రభాతవార్త:** తెలంగాణ రాష్ట్ర షూటింగ్ బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెప్టెంబర్ 22 నుండి 24 వరకు మహబూబాబాద్ జిల్లా నెల్లికుదురులో జరిగిన 44వ జూనియర్ రాష్ట్ర స్థాయి షూటింగ్ బాల్ పోటీలలో కొల్లాపూర్ క్రీడాకారిణి దీపిక ఉమ్మడి మహబూబ్ నగర్ బాలికల జట్టు తరుపున ఆడి మూడో స్థానంలో నిలిచేందుకు కృషి చేసి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైంది. నాగర్ కర్నూల్ జిల్లా కొల్లాపూర్ మండలం నార్లాపూర్ గ్రామానికి చెందిన వెంకటస్వామి, జ్యోతి దంపతుల నాల్గవ కూతురు వి. దీపిక క్రీడల్లో అసమాన క్రీడా నైపుణ్యతను ప్రదర్శిస్తున్నది. మూడో స్థానంలో నిలిచిన తెలంగాణ రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ,ఎమ్మెల్సీ దామోదర్ రెడ్డి ,రత్న గిరి పౌం డేషన్ కన్వీనర్ దర్మతేజ సహకారం తో బుధవారం సాయంత్రం కొల్లాపూర్ లో జాతీయస్థాయి క్రీడలకు ఎంపికైన వి.దీపికను, కోచ్ విశ్రాంత పీఈటి బి.గోపాలాన్ని సన్మానించి అభినందించారు. జాతీయస్థాయి క్రీడలలో పాల్గొనేందుకు వీ.దీపికకు నగదు రూ.5వేలు మంత్రి అందించి జాతీయ స్థాయి క్రీడల్లో రాణించాలని సూచించారు. క్రీడలకు పూర్తి సహకారం అందిస్తానని తెలిపారు. నార్లాపూర్ గ్రామపంచాయతీలో మాజీ సర్పంచ్ చిట్టెమ్మ వెంకటస్వామి ఆధ్వర్యంలో నల్లమల జాతీయ స్థాయి క్రీడాకారిణి వి. దీపికను ఘనంగా సన్మానించి అభినందించారు. కొల్లాపూర్ ఎస్సై హర్శికేస్ తన చాంబర్లో అమ్మాయిని ఘనంగా సన్మానించి అభినందించారు. కార్యక్రమంలో వరిదేల వాసి కోచ్ విశ్రాంత పి ఈటి బి.గోపాలం, ఆర్థిక సహకారం అందించిన చందర్‌నాయక్, మాజీ ఎంపీటీసీ రామన్ గౌడ్, మాల వెంకటస్వామి మున్నూరు నిరంజన్, జగపతిరావు పాల్గొన్నారు.



క్రీడాకారిణి దీపికను సన్మానిస్తున్న మంత్రి జూపల్లి

# నేడు స్థానిక ఎన్నికల నోటిఫికేషన్

- భూత్పూర్‌లో పది ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు నామినేషన్లు
- ఎంపీపీ బీసీ మహిళ,జెడ్పీటీసీ బీసీ-జనరల్‌కు రిజర్వేషన్
- అందరి దృష్టి బీసీ మహిళ, బీసీ జనరల్‌పైనే..

**భూత్పూర్,అక్టోబర్ 8,ప్రభాతవార్త :** స్థానిక సంస్థల ఎంపీటీసీ,జెడ్పీటీసీ ఎన్నికలకు నేడు నోటిఫికేషన్ వెలువడనుంది. ఎంపిటీసీ,జెడ్పీటసీ పదవులకు రెండు విడతలుగా ఎన్నికలు నిర్వహించనున్నారు.మొదటి విడత ఎన్నికలకు గురువారం నోటిఫికేషన్ వెలువడతుండగా, రెండో విడత ఎన్నికలకు ఈ నెల 13న నోటిఫికేషన్ వెలువడనుంది. మొదటి విడతకు నామినేషన్లు ఈ నెల 11వరకు స్వీకరిస్తారు. నామినేషన్ల ఉపసంహరణ ఈ నెల 15న కాగా, ఎన్నికలు ఈ నెల 23న నిర్వహిస్తారు. ఇదేవిధంగా రెండో విడత ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు ఈ నెల 13న నోటిఫికేషన్ వెలువడనుండగా, నామినేషన్లు ఈ నెల 15వరకు స్వీకరిస్తారు. నామినేషన్ల ఉపసంహరణ ఈ నెల 19కాగా, పోలింగ్ ఈ నెల 27న నిర్వహిస్తారు.ఎంపీటీసీ,జెడ్పీటీసీ ఫలితాలు వచ్చే నెల 11న వెలువరిస్తారు. రాష్ట్రంలో చేపట్టిన బీసీ కులగణన అనంతరం ఎన్నో అవాంతరాల తదుపరి ఎట్టకేలకు గురువారం స్థానిక సంస్థల ఎన్నికలకు నోటిఫికేషన్ వెలువడనుంది. బీసీలకు 42శాతం రిజర్వు కావడంతో ఎంపిపి బీసీ మహిళ,జెడ్పీటీసీ బీసీ జనరల్‌కు కేటాయించడంతో ఈ సారి నిర్వహిస్తున్న ఎంపిటీసీ,జెడ్పీటీసీ ఎన్నికలతో పాటు సర్పంచు



ఎన్నికలు రసవత్తరంగా మారనున్నాయి. అందరి దృష్టి బీసీ మహిళ,బీసీ జనరల్ పైనే ఉందని చెప్పకతప్పదు.

### 17న సర్పంచు ఎన్నికలకు నోటిఫికేషన్

మూడు విడతలుగా నిర్వహించే సర్పంచు ఎన్నికలకు నోటిఫికేషన్ ఈ నెల 17న వెలువడనుంది.మొదటి విడత సర్పంచు ఎన్నికలకు ఈ నెల 17నుంచి 19వరకు నామినేషన్లను స్వీకరిస్తారు. నామినేషన్ల ఉపసంహరణ ఈ నెల 23వరకు ఉంటుంది. పోలింగ్ ఈ నెల 31న ఉంటుంది. ఇదే రోజు సాయంత్రం ఫలితాలు ప్రకటిస్తారు. రెండో విడత సర్పంచు ఎన్నికలకు నోటిఫికేషన్ ఈ నెల 21న వెలువడనుంది. నామినేషన్లను ఈ నెల 23వరు స్వీకరిస్తారు.నామినేషన్ల ఉపసంహరణ ఈ నెల 27వరకు ఉంటుంది.పోలింగ్ తేది వచ్చే నెల 4న ఉంటుంది. ఇదే రోజు సాయంత్రం ఫలితాలు వెలువరిస్తారు. మూడో విడత సర్పంచు ఎన్నికలకు నోటిఫికేషన్ ఈ నెల 25న ఉంటుంది.నామినేషన్లను స్వీకరించేందుకు ఈ నెల 27వరకు ఉంటుంది.మూడో విడత సర్పంచు ఎన్నికలకు నామినేషన్ల ఉపసంహరణ ఈనెల 31వరకు నిర్ణయించారు. వచ్చే నెల 8న ఉంటుంది. ఇదే రోజు సాయంత్రం ఫలితాలను వెల్లడిస్తారు. భూత్పూర్‌లో 10 ఎంపిటీసీ, ఒక జెడ్పీటీసీ, 19సర్పంచు పదవుల కోసం ఎన్నికలు భూత్పూర్ మండలంలో 10ఎంపీటీసీ పదవులు, ఒక జెడ్పీటీసీ పదవులకు ఎన్నికలు నిర్వహిస్తున్నారు. ఇదేవిధంగా 19సర్పంచు పదవులకు ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు సకల ఏర్పాట్లు చేశారు. భూత్పూర్ ఎంపిపి పదవి బీసీ మహిళకు, జెడ్పీటీసీ బీసీ జనరల్‌కు కేటాయించడంతో పదవులనాశించే బీసీయేతర నాయకులకు ఈ ఎన్నికలు ఓ సవాల్‌గా మారాయలని పలువురు పేర్కొంటున్నారు.ఈ ఎన్నికలలో చాలా మటుకు సీట్లు బీసీ మహిళ,బీసీ జనరల్‌కే రావడంతో గామపంచా యతీ ఎన్నికలు చాలా ఇంట్రెస్టింగ్ మారాయని చెప్పకతప్పదు. పదవులను ఆశించిన అన్ని పార్టీల ఓసీలు తమ ప్రభావంతో స్థానిక ఎన్నికల బరిలో పరోక్షంగా అనుకూలంగా ఉండే అభ్యర్థులను నిలిపి తమ బలాన్ని ప్రదర్శించే అవకాశాలు మెండుగా కన్పిస్తున్నాయి.




మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

## రైతులకు ఇబ్బందులు రానీయొద్దు

- జిల్లాలో 110 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు
- పేట జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్

**నారాయణపేట, అక్టోబరు 8, ప్రభాతవార్త:** రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద అన్ని సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఆదేశించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియలో ఎవరైనా బాధ్యతా రహితంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. 2025-26 ఖరీఫ్ సీజన్ ధాన్యం కొనుగోళ్లపై ఆర్డీవో కార్యాలయంలో పౌర సరఫరా శాఖ ఆధ్వర్యంలో జరిగిన అవగాహన సదస్సులో ఆమె పాల్గొన్నారు. ఈ సీజన్‌లో జిల్లాలో 110 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. గన్నీసంచులు తూకం యంత్రాలు టెంట్లు తాగునీరు ఫస్ట్ ఎయిడ్ కిట్లు వంటి వసతులు ముందుగా సిద్ధం చేయాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు అనంతరం వెంటనే రైస్ మిల్లులకు తరలించేలా లారీలు హమాలీలు సిద్ధంగా ఉండాలని సూచించారు. రైతుల ఖాతాల్లో డబ్బులు వెంటనే జమయ్యేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. గత సీజన్‌లో రూ.460 కోట్ల విలువైన ధాన్యం కొనుగోలు చేయగా ఈ సారి మరింత పెరుగుదల ఉండే అవకాశం ఉందన్నారు. అధికారులంతా నిబంధనలు కచ్చితంగా పాటించి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. అదనపు కలెక్టర్ శ్రీను మాట్లాడుతూ ఈ నెల రెండో వారంలో ధాన్యం కొనుగోళ్లు ప్రారంభమయ్యే అవకాశం ఉందన్నారు. గత సీజన్‌లో 190 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయగా ఈసారి 312 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసే అవకాశం ఉందని తెలిపారు. సదస్సులో జిల్లా అధికారులు, రైస్ మిల్లర్లు, ఐకెపి నిర్వాహకులు పాల్గొన్నారు.

### ఎన్నికలలో రిటర్నింగ్ అధికారులు కీలక పాత్ర పోషించాలి

నారాయణ పేట జిల్లా కేంద్రంలో కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారుల సమావేశం నిర్వహించి వారికి దిశానిర్దేశం చేశారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారులు కీలక భూమిక పోషించాలని జిల్లా కలెక్టర్/ఎన్నికల అధికారి సిక్తా పట్నాయక్ తెలిపారు. జిల్లాలో 13 జడ్పీటీసి 136 ఎంపీటీసీ స్థానాలకు రెండు విడతల్లో 272 గ్రామ పంచాయతీలకు మూడు విడతల్లో ఎన్నికలు జరుగనున్నాయని తెలిపారు. నామినేషన్ ప్రక్రియను వీడియోగ్రఫీ చేయాలని సంతకాలు లేదా ధ్రువపత్రాలు లోపిస్తే వెంటనే సరిచూడాలని సూచించారు. నామినేషన్ తిరస్కరణలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. నామినేషన్ కేంద్రానికి 100 మీటర్ల పరిధిలో ఒక్క వాహనానికే అనుమతి ఉందని నామినేషన్ గదిలో ముగ్గురి కంటే ఎక్కువ మందికి ప్రవేశం లేదని తెలిపారు. నామినేషన్ల పరిశీలన అప్పీలు గుర్తుల కేటాయింపు వంటి అంశాలపై అదనపు కలెక్టర్ సంచిత్ గంగ్వార్ వివరించారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ ప్రణయ్ కుమార్, అన్ని మండలాల ఆర్‌వోలు పాల్గొన్నారు.




# ఇంట్లో కూర్చుంటే బీఫాం రాదు..

- పగటి కలలు మాని..పార్టీ కార్యక్రమాల్లో పాల్గొనాలి
- రాజ్యాంగం కల్పించిన హక్కును రక్షించుకుందాం
- డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబర్ 8, ప్రభాతవార్త:** రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కాపాడుకుందామని డీసీసీ అధ్యక్షుడు, దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి అన్నారు. మహబూబ్‌నగర్ పార్టీ కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ దేశంలో ఎక్కడెక్కడ ఓట్ చోరీ జరిగిందనే విషయాలను రాహుల్ గాంధీ ఆధారాలతో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చినట్లు తెలిపారు. ఓటు చోరీని అరికట్టాల్సిన బాధ్యత ఎన్నికల కమిషన్ పై ఉందన్నారు. ఓటు చోరీపై ఏఐసీసీ ఆదేశాల మేరకు నిర్వహిస్తున్న సంతకాల సేకరణ కార్యక్రమంలో గ్రామస్థాయి నుంచి విజయవంతం చేయాలని కోరారు. దేశంలో వ్యవస్థలను నిర్వీర్యం చేస్తున్న బీజేపీ దేశంలో వ్యవస్థలను కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తున్నదని డీసీసీ అధ్యక్షులు ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి అన్నారు. జిల్లా




మాట్లాడుతున్న ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి

కేంద్రంలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సంతకాల సేకరణ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఏఐసీసీ నేతృత్వంలో ఓట్ చోరీపై సంతకాల సేకరణకు శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. పార్టీలకతీతంగా ప్రతి గ్రామంలో 100 మందిని ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని కోరారు. పార్టీ ఇచ్చే కార్యక్రమాలకు తప్పనిసరిగా హాజరుకావాలని డీసీసీ అధ్యక్షులు అన్నారు. కార్యక్రమాలకు కొంతమంది డుమ్మా కొడుతున్నారని, భవిష్యత్తులో కాంగ్రెస్ తరఫున సర్పంచ్, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, కౌన్సిలర్లుగా నిలబడాలనుకునేవారు పార్టీ కార్యక్రమాలకు రాకుండా ఇంట్లో కూర్చొని బీఫామ్ లు వస్తాయన్నది పగటికలలు అని అన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత, నాయకులు వినోదకుమార్, జహీర్ అక్తర్, ఎన్పి.వెంకటేశ్, సీజే బెనహర్, వసంత, సిరాజ్ ఖాద్రీ, సాయిబాబా, పయాజ్, అజ్మత్ అలీ, అవేజ్, అబ్దుల్ హక్ పాల్గొన్నారు.


కాంగ్రెస్ ఎన్నికల హామీ బాకీ కార్డు ఆవిష్కరిస్తున్న దృశ్యం

## కాంగ్రెస్ ఎన్నికల హామీ బాకీ కార్డు ఆవిష్కరణ

**కల్వకుర్తి, అక్టోబర్ 8 ప్రభాతవార్త:** కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో ఇచ్చిన 6 గ్యారంటీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే జైపాల్ యాదవ్ అన్నారు. కల్వకుర్తి పట్టణంలోని ఆయన నివాసంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఎన్నికల హామీ బాకీ కార్డును ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా వ్యతిరేక విధానాలను అమలు చేస్తూ దోచుకోవడం దాచుకోవడమే కాంగ్రెస్ పార్టీ పనిగా పెట్టుకుందని దుయ్యబట్టారు. 22నెలలుగా వివిధ పథకాల కింద బాకీ పడిన వివరాలను వివరించారు. రైతులకు రైతు భరోసా, రుణమాఫీ, బోనస్, ఉపాధి హామీ బాకీ, నిరుద్యోగులకు, విద్యా భరోసా, ఆటో కార్మికుల, మహిళలకు, వృద్ధులకు,దివ్యాంగులకు, విద్యార్థినులకు స్కూటీ, ఫీజు రీయింబర్స్‌మెంట్, కళ్యాణలక్ష్మి, తులం బంగారం లాంటి పథకాలు 22 నెలల నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు బాకీ ఉందన్నారు. కామారెడ్డి డిక్లరేషన్ అమలు చేయాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను, ఇచ్చిన హామీలను ప్రజలకువివరిస్తూ ప్రజల్లోకి బిఆర్ఎస్‌పార్టీ నాయకులు,కార్యకర్తలు గ్రామ పంచాయతీ, పురపాలక, వార్డు, బూతు స్థాయిలో చైతన్యం చేస్తామని తెలిపారు. పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టుకు మాజీ కేంద్రమంత్రి జైపాల్ రెడ్డి పేరు పెట్టి ఒక్క రూపాయి కేటాయించే సత్తా లేదన్నారు. ఎన్నికల సమయంలో ఆరు గ్యారెంటీలు మాయ మాటలు చెప్పి గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేసే వరకు వదిలే ప్రసక్తే లేదని తెలిపారు. సమావేశంలో మాజీ మున్సిపల్ చైర్మన్ ఎడ్మ సత్యం, మాజీ జెడ్పీటీసీ ధ్యాప విజితా రెడ్డి, నాయకులు విజయ్‌గౌడ్, నరసింహారెడ్డి, సూర్య ప్రకాష్‌రావు, షాహిద్,వెంకటయ్య, మనోహర్‌రెడ్డి,జంగయ్య,శేఖర్,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ముమ్మరంగా వాహనాల తనిఖీ


ఉప్పునుంతల అచ్చంపేట మార్గంలో తనిఖీ చేస్తున్న పోలీసులు

**ఉప్పునుంతల, అక్టోబరు 8 ప్రభాతవార్త:** మండల పరిధిలో పోలీసులు ముమ్మరంగా వాహనాల తనిఖీలు చేపట్టారు. రవాణా శాఖ సూచనల మేరకు, ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని ఎస్ఐ వెంకట్ రెడ్డి ఆధ్వర్యంలో కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల వద్ద తనిఖీలు నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. ఉప్పునుంతల పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రధాన రహదారులు, గ్రామీణ మార్గాలు, బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో వాహనాలను నిలిపి డ్రైవర్ల లైసెన్స్‌లు, వాహన రిజిస్ట్రేషన్ పత్రాలు, ఇన్సూరెన్స్, ప్యాల్యూషన్ సర్టిఫికెట్లను పరిశీలించారు. హెల్మెట్ లేకుండా ప్రయాణిస్తున్న ద్విచక్ర వాహనదారులు, సీటు బెల్ట్ లేకుండా ప్రయాణిస్తున్న కారు డ్రైవర్లపై ప్రత్యేక దృష్టి సారించారు. పత్రాలు సరిగా లేకపోయిన వాహనాలను స్వాధీనం చేసుకొని, యజమానులకు హెచ్చరికలు జారీ చేశారు.అలాగే మద్యం సేవించి డ్రైవింగ్ చేసినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై వెంకట్ రెడ్డి హెచ్చరించారు. ప్రజల ప్రాణ భద్రత మాకు ముఖ్యం. రవాణా నియమాలను కచ్చితంగా పాటించాలి. హెల్మెట్, సీటు బెల్టులు ప్రాణాలను రక్షి ంచే కవచాలు అని ఆయన పేర్కొన్నారు. రవాణా నియమాల ఉల్లంఘనపై జరిమానాలు విధించడంతో పాటు, ప్రజల్లో అవగాహన కల్పించే చర్యలు కూడా చేపట్టనున్నట్లు తెలిపారు. మండల వ్యాప్తంగా ఇటువంటి తనిఖీలు కొనసాగుతాయని తెలిపారు. తనిఖీలో ఎస్సై తోపాటు ఏఎస్ఐ రెడ్యా నాయక్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రైవేట్ ఉద్యోగుల కోసం నిరంతరం పోరాడుతాం

### - టీపీయూఎస్ మహిళా అధ్యక్షురాలు శ్రీవల్లి


డైరీ అందజేస్తున్న శ్రీవల్లి

**జడ్చర్ల, అక్టోబరు8,ప్రభాతవార్త:** టీపీయూఎస్ నిరంతరం ప్రైవేట్ ఉద్యోగుల భద్రత కొరకు పోరాడుతుందని తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగ సంఘం మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీవల్లి తెలిపారు. జడ్చర్ల లో తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో ప్రైవేట్ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ప్రైవేట్ ఉద్యోగుల యొక్క సమస్యలు వారు ఎలా ఎదుర్కోవాలి, ప్రైవేట్ ఉద్యోగుల,ఇన్సూరెన్స్, పీఎఫ్, వారి యొక్క పని సమయాలు,వేతనాలు తదితర విషయాల గురించి చర్చించారు. ఈ సందర్భంగా తెలంగాణ ప్రైవేట్ ఉద్యోగ సంఘం మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు శ్రీవల్లిమాట్లాడుతూ ప్రైవేట్ సంస్థల్లో పని చేసే ఉద్యోగులు, వివిధ కంపెనీలలో పని చేసే మహిళా వర్కర్స్,పని చేసే చోట ఎలాంటి సమస్యలు ఉన్న తెలంగాణ ప్రైవేట్‌ఉద్యోగ సంఘానికి తెలియచేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షురాలు లక్ష్మిదేవి, ఉమెన్స్ డెవలప్మెంట్ సొసైటీ అధ్యక్షురాలు బాలమణి ప్రైవేట్ ఉద్యోగులు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్ ఎదుట బిజెపి నాయకుల ధర్నా

**వెల్దండ, అక్టోబర్ 8 ప్రభాతవార్త:** మండలంలోని పెద్దాపూర్ గ్రామంలో దుర్గామాత మండపం వద్ద వేసిన ఫ్లెక్సీల విషయంలో గ్రామానికి చెందిన కిషోర్ రెడ్డి ఏబీవీపీ నాయకులు హరి ప్రసాద గౌడుల మధ్య మాట మాట పెరిగి వెల్దండ పోలీస్ స్టేషన్‌లో ఈ నెల 4వ తేదీన హరి ప్రసాద్ గౌడ్‌పై కిషోర్ రెడ్డి ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు బుధవారం హరిప్రసాద్ గౌడ్‌ను పోలీస స్టేషన్‌కు విచారణ నిమిత్తం పోలీసులు పిలిచి సీఐ విష్ణువర్ధన్ రెడ్డి అమానుషంగా వ్యవహరించారని హరి ప్రసాద్‌గౌడ్ బిజెపి పార్టీ నాయకులతో పోలీస్‌స్టేషన్ ముందు ధర్నా చేపట్టారు. జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యులు తల్లోజు ఆచారి పోలీస్‌స్టేషన్‌కు చేరుకొని వివరాలు అడిగి తెలుసుకొని ధర్నా విరమింపచేశారు. ఈ విషయంపై సిఐ విష్ణువర్ధన్ రెడ్డిని వివరణ కోరగా గ్రామంలో జరిగిన ఫ్లెక్స్ వివాద విషయంలో ఫిర్యాదు మేరకు విచారణ నిమిత్తం బుధవారం హరిప్రసాద్ గౌడ్ పోలీస్‌స్టేషన్‌కు పిలిచాము తప్ప ఏ మాత్రం ఆమానుషంగ వ్యవహరించలేదని సీఐ వివరించారు.

## గ్రామాల్లో బిజెపిని బలోపేతం చేయాలి

### బిజెపి మండల అధ్యక్షులు గువ్వని నవీన్

**లింగాల, అక్టోబరు8 ప్రభాతవార్త:** గ్రామాల్లో బిజెపి కార్యకర్తలు పార్టీ బలోపేతానికి కృషి చేయాలని బిజెపి మండలధ్యక్షులు గువ్వని నవీన్ అన్నారు. బుధవారం మండలంలోని కోమటకుంట గ్రామంలో భారతీయ జనతా పార్టీ దిమ్మె ఏర్పాటుకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా బిజెపి మండల అధ్యక్షులు గువ్వని మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టౌన్ సెక్రెటరీ బయ్యారాజు, కార్యకర్తలు, మండల జనరల్ సెక్రెటరీ సైదులు, స్వామి, బాలపీరు, వెంకటయ్య, రాములు, సత్యం, చిన్న, శివ, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.


కోమటికుంటలో బిజెపి దిమ్మె ఏర్పాటుకు భూమి పూజ చేస్తున్న గువ్వని నవీన్, కార్యకర్తలు

# ఆరు గ్యారంటీలు అమలు ఎక్కడ..?

**బీసీలను మోసం చేసిందే రేవంత్‌రెడ్డి**
**బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తే**
**బీసీలకు 50% రిజర్వేషన్ కల్పిస్తాం**
**స్థానిక ఎన్నికలలో బిఆర్ఎస్ పార్టీ సత్తా చూపిద్దాం**
**బిఆర్ఎస్ కార్యకర్తల సన్నాహక సమావేశంలో**
**మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి**


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి


సన్నాహక సమావేశంలో పాల్గొన్న బిఆర్ఎస్ నాయకులు

**మద్దూరు, అక్టోబరు8 ప్రభాతవార్త :** మద్దూరు మున్సిపాలిటీ పట్టణ కేంద్రంలో బుధవారం షాప్ గార్డెన్‌లో ఉమ్మడి మద్దూరు మండల బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ రాష్ట్రాన్ని పరిపాలిస్తున్న రేవంత్ రెడ్డి ప్రభుత్వం నేడు ప్రజలను 420 హామీలతో మోసం చేసిందని గుర్తు చేశారు. ఎలాంటి అధికారం లేని తన అన్నకు హంగు ఆర్భాటలతో సెక్యూరిటీ కల్పించడం కొడంగల్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేయించడం రాజ్యాంగానికి విరుద్ధమని అన్నారు. నేడు బీసీలను 42శాతం రిజర్వేషన్ అనేఅంశంతో తనే అమలు చేస్తున్నట్టు ప్రకటించి తన సన్నిహితులతో బీసీలకు వ్యతిరేకంగా కోర్టులో కేసులు వేయించడం జరుగుతుందని అన్నారు. రాబోయే కాలంలో బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తే బీసీలకు 50 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని హామీ ఇచ్చారు. కొడంగల్ నియోజకవర్గంలో అభివృద్ధి పేరుతో ఈ ప్రాంత ప్రజలను మోసం చేస్తున్నాడని ఎద్దేవా చేశారు. నాడు బిఆర్ఎస్ పార్టీ శంకుస్థాపన చేసిన పనులకు నేడు తను, తన సోదరుడు ప్రారంభోత్సవం చేస్తున్నారని గుర్తు చేశారు. కొడంగల్ నియోజకవర్గంలో పోలీసులు అధికార పార్టీకి వత్తాసు పలుకుతూ రాజకీయాలు చేస్తున్నారని రాబోవు కాలంలో బిఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తే ఇలాంటి పోలీసులను వదిలే ప్రసక్తేలేదని హెచ్చరించారు.ఎలక్షన్ కమిషన్ ఒకవేళ రాష్ట్రంలో స్థానిక ఎన్నికలు నిర్వహిస్తే బిఆర్ఎస్‌పార్టీ యొక్క సత్తా చూపాలని పార్టీ కార్యకర్తలకు సూచించారు. రమేష్ నాయక్ కు న్యాయం చేయాలిమద్దూర్ మున్సిపాలిటీ పట్టణ కేంద్రంలో కంటి హాస్పిటల్ నిర్వహిస్తున్న రమేష్ నాయక్‌కు సీఎం రేవంత్‌రెడ్డి న్యాయం చేయాలని గుర్తు చేశారు. సీఎం రేవంత్ రెడ్డికి సన్నిహితంగా ఉండే కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలైన తాజుద్దీన్, యాసిన్ అనే వ్యక్తులు డబ్బుల కోసం రమేష్ నాయక్‌ను బెదిరించడం శోచనీయమైన అంశమని గుర్తు చేస్తూ అలాంటి వారినిచట్టపరంగా శిక్షించాలనిఅన్నారు. సామాన్య వ్యక్తుల పై దాడి చేసిన వ్యక్తులు చట్టపరంగా శిక్షించబడకుండా సీఎం రేవంత్ రెడ్డి అండదండలతో సహజంగా తిరగడం జరుగుతుందని, మరో మూడు రోజుల్లో రమేష్ నాయక్‌ను ఎక్కడున్నా తీసుకురావాలని అలాగే ఆయనకు న్యాయం చేయాలని లేకుంటే నియోజకవర్గంగా టిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు ధర్నాలు, రాస్తారోకోలు నిర్వహించబడునని డీజీపీకి, సీఎం రేవంత్ రెడ్డికి సవాల్ విసిరారు. వివిధ గ్రామాల కాంగ్రెస్, ఇతర పార్టీ నాయకులు మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీలో చేరారు. మద్దూర్ మున్సిపాలిటీ పట్టణ కేంద్రానికి చెందిన కొంతం విఠల్, బిఆర్ఎస్ పార్టీ సామాన్య కార్యకర్త కూతురు కొంతం శిరీషకు ఎంబిబిఎస్ సీటు రావడం వల్ల ప్రత్యేకంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలోబిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు సలీం, వీరారెడ్డి, బసప్ప, బర్ల శివకుమార్, బర్ల జగదీశ్వర్, మద్దూరు మండల అధ్యక్షులు గోపాల్, కొత్తపల్లి మండల అధ్యక్షులు మధుసూదన్ రెడ్డి, నెల్లి రాములు,నర్సింలు, రాజు, విఠల్, మహేందర్, హబీబ్, పీర్ హైమద్‌వివిధ గ్రామాల మాజీఎంపిటిసిలు, మాజీ సర్పంచులు, పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# స్థానికంలో కాంగ్రెస్‌కు గుణపాఠం తప్పదు

### మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి


ఆర్టీసీ ప్రయాణికునికి బాకీ కార్డు అందజేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల

**మహబూబ్‌నగర్ (చిన్న చింతకుంట), అక్టోబరు 8 ప్రభాతవార్త :** అమలుకు సాధ్యం కాని హామీలతో గద్దెనెక్కిన కాంగ్రెస్ పార్టీకి స్థానిక ఎన్నికల్లో ప్రజలే గుణపాఠం చెప్తారని మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని వడ్డేమాన్ గ్రామంలో కాంగ్రెస్ బాకీల కార్డులను ఇంటింటికి వెళ్లి అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారం కోసం కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారెంటీల పేరిట ప్రజలను మోసం చేశారని ఆయన విమర్శించారు. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ గాలికి వదిలేసిందన్నారు. కాంగ్రెస్ గ్యారెంటీ కార్డులో చెప్పినవే బాకీ కార్డు రూపంలో ప్రజలకు అందిస్తూ వారికి అవగాహన కల్పిస్తున్నామన్నారు. గ్యారెంటీ కార్డు బాకీ కార్డులను పరిశీలిస్తే వాస్తవాలు ప్రజలకు అర్థం అవుతాయని ఆయన తెలిపారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే రైతుబంధు ఎగ్గొట్టారని, రుణమాఫీ పూర్తిస్థాయిలో చేయలేదని ఆయన విమర్శించారు.ఇప్పటికీ రైతులకు యూరియా కష్టాలు తప్పడం లేదని రోజుల వారీగా తిరిగిన యూరియా సంచి రైతులకు దొరకడం లేదని, రైతు ప్రభుత్వం అని చెప్పుకుంటున్న కాంగ్రెస్ ప్రభుత్వం యూరియా సంచి ఇవ్వలేని దుస్థితిలో ఉందని ఆయన విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని స్థానిక ఎన్నికల్లో ప్రజలు తరిమికొడతారని ఆయన హెచ్చరించారు. ఆనాటి రోజులు తెస్తా అని చెప్పిన నాయకులు ఇప్పుడు రైతులకు కష్టాలను తీసుకొచ్చారన్నారు. ఇప్పటికీ గ్రామాలలో ఈరోజుకు బిఆర్ఎస్ హయాంలో చేసిన అభివృద్ధి కనబడుతుందని ఆయన తెలిపారు. స్థానిక ఎన్నికల్లో బిఆర్ఎస్ గెలుపుకై ప్రతి కార్యకర్త సైనికుల పనిచేయాలని అని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు కోట రాము, నాయకులు కరుణాకర్ రెడ్డి, వట్టెం రాము, దశరథ్ రెడ్డి, మల్లెల బాలరాజ్, కురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్ పార్టీ కార్యాలయం ప్రారంభించిన ఎమ్మెల్యే జియంఆర్


మాట్లాడుతున్న ఎమ్మెల్యే జిఎంఆర్


పార్టీ కండువా వేసి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే

**మూసాపేట్, అక్టోబరు8 ప్రభాతవార్త:** మండల కాంగ్రెస్ పార్టీ కార్యాలయ ప్రారంభోత్సవంలో పాల్గొన్న దేవరకద్ర ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి (జిఎంఆర్) జిల్లా పిఆర్టియు గాల్‌రెడ్డి హర్షవర్ధన్‌రెడ్డి సమక్షంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు, తుంకిణి పూర్ మాజీ సర్పంచ్ బుచ్చన్న గౌడ్ పలువురు బిఆర్ఎస్ నాయ కులు, కార్యకర్తలు,దాసర్‌పల్లి గ్రామానికి చెందిన మాజీ ఉప సర్పంచ్, బిఆర్ఎస్ సీనియర్ నాయకులు జి. సత్యనారాయణ పలువురు కార్యకర్తలు, నిజలాపూర్ గ్రామానికి చెందిన బిఆర్ఎస్ నాయకులు, ముదిరాజ్ సంఘం గ్రామ అధ్యక్షులు సి.బాబు, జి.దయాకర్, గాజుబండ వెంకటేష్, మోత్కరి భీమేష్, సి.చిన్న కురుమన్న సిరిపురం చందు, సి.రాములు, సి. తిమన్న పలువురు బిఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలును కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించిన అనంతరంఎమ్మెల్యే మాట్లాడుతూ చేస్తున్న అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలకు ఆకర్షితులై కాంగ్రెస్ పార్టీలో చేరామని అన్నారు. ఓట్ చోరి కార్యక్రమానికి సంబంధించిన సంత కాల సేకరణలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షు లు శెట్టి చంద్రశేఖర్, మాజీ ఎంపీపీలు బగ్గి కృష్ణయ్య, రామన్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ బాలనర్సింహులు, అచ్చపల్లి మాజీ సర్పంచ్ చంద్ర శేఖర్, నిజలాపూర్, రామచందర్, సిజి గోవర్ధన్, బోయా రవి,యట సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్ ఎన్నికల్లో ఎన్నికల కమిషన్ నిబంధనలు పాటించాలి

### ఇటిక్యాల,ఎర్రవల్లి మండలాల ప్రిసైడింగ్ అధికారులకు శిక్షణ


కొండేరులో సర్పంచ్ ఎన్నికల శిక్షణకు హాజరైన ప్రిసైడింగ్ అధికారులు

**ఇటిక్యాల అక్టోబర్8, ప్రభాతవార్త:** స్థానిక సంస్థలు ఎన్నికలలో భాగంగా సర్పంచు. వార్డు మెంబర్ ల ఎన్నికలలో బూత్ ప్రిసైడింగ్ అధికారుల పాత్ర చాలా ముఖ్యమని ఎన్నికల కమిషన్ నిబంధనల మేరకు కట్టుబడి పని చేయాలని ఎంపీడీవోలు మహమ్మద్ అజార్ మోహియుద్దీన్. అబ్దుల్ సయ్యద్ ఖాన్. శిక్షణ ట్రేనర్లు అమీర్ పాష.విష్ణు లు పిఓలకు వివరించారు.బుధవారం ఉమ్మడి మండలం ఇటిక్యాల మండలాలకు సంబంధించి 61 మంది సర్పంచి ఎన్నికల ప్రి సైడింగ్ అధికారుల శిక్షణను మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో 61 మంది పిఓలకు నిర్వహించారు. అలాగే ఎర్రవల్లి మండలానికి సంబంధించి 85 మంది పిఓలకు కొండేరు లోని ఉన్నత పాఠశాలలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కొండేరులో నిర్వహించిన శిక్షణలో ఎర్రవల్లి మండల జడ్పిటిసి ఎన్నికల రిటర్నింగ్ అధికారి సుసిత హాజరై ఎన్నికల నిర్వహణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. అనంతరం ప్రిసైడింగ్ అధికారులకు ట్రేనర్లు వివరిస్తూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల కమిషన్ సూచించిన నిబంధనల మేరకు ఎన్నికల నిర్వహణలో పిఓలు అప్రమత్తంగా ఉండి ఎన్నికల నిర్వహణను ప్రశాంతంగా పూర్తి అయ్యేలా చూసుకోవాలని వివరించారు. ఎన్నికల కమిషన్ పొందుపరిచిన అంశాలవారీగా ప్రొజెక్టర్ల ద్వారా ఎన్నికల నిర్వహణ. ఓటింగ్ సరళి. రాజకీయ పార్టీల కు చెందిన ఏజెంట్ల తో సమన్వయం చేసుకుంటూ ఎన్నికల నిర్వహణను పూర్తి చేసుకోవాలన్నారు. రాజకీయ పార్టీల పరంగా పోటీ చేసిన అభ్యర్థులకు సంబంధించి ఏజెంట్ల విధులు బాధ్యతలు కూడా వివరించారు. సర్పంచ్ ఎన్నికల్లో ఓటర్ జాబితాలో పేరు ఉండి అలాంటివారు ఎన్నికల కమిషన్ సూచించిన గుర్తింపు కార్డుల ఆధారంగా ఓటర్ ఓటు వేసే అవకాశం కల్పించాలన్నారు. దొంగ ఓట్లు. మరియు ఒకే ఓటరు రెండుసార్లు ఓటింగ్ లో పాల్గొనకుండా దృష్టి పెట్టాలని పోలింగ్ బూతులలో ప్రిసైడింగ్ అధికారులు. సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ఎన్నిక మొదలై ముగిసే వరకు కూడా ప్రతి అంశంలో ఎన్నికల కమిషన్ నిబంధనలను పాటించాలన్నారు. సమయం ప్రకారంఓటింగ్ పూర్తి చేసి పోటీచేసిన అభ్యర్థులు. వారి పోలింగ్ ఏజెంట్ల ద్వారా కౌంటింగ్ మొదలుపెట్టేలా చూసుకోవాలన్నారు. నిష్పక్ష పాతంగా ఎన్నికల ఫలితాలను ప్రకటించేలా చూసుకోవాలన్నారు. 2రోజుల క్రితం 6 వ తేదీ కూడా జడ్పిటిసి ఎంపిటిసిల ఎన్నికలలో పాల్గొనే పిఓ. ఏపిఓలకు శిక్షణ పూర్తయింది.ఈ కార్యక్రమంలో ఇటిక్యాల ఎంఈఓ వెంకటేశ్వర్లు. పిఓలు పాల్గొన్నారు.

## ఫింగర్ ప్రింట్స్ డివైస్‌తో తనిఖీలు

**నారాయణపేట టౌన్, అక్టోబరు 8 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లా కేంద్రంలో ముందస్తు నేరాల నియంత్రణలో భాగంగా దొంగతనాల నివారణనే లక్ష్యంగా, అనుమానిత వ్యక్తులను మరియు పాత నేరస్తులను గుర్తించడానికి బ్లూ కోర్ట్స్ పోలీసులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించడం జరిగిందని ఎస్సై వెంకటేశ్వర్లు తెలిపారు. బుధవారం నారాయణపేట బస్టాండ్ మరియు ప్రధాన చౌరస్తాలలో నారాయణపేట పోలీసులు గోపాల్, రవి కుమార్‌లు అకస్మికంగా ఫింగర్ ప్రింట్స్ డివైస్ తో తనిఖీలు నిర్వహించడం జరిగింది. అనుమానాస్పదంగా సంచరిస్తున్న వ్యక్తులను తగిన రీతిలో పరిశీలించి, ఆధునిక సాంకేతికతను వినియోగిస్తూ ఫింగర్ ప్రింట్ డివైస్‌తో వ్యక్తుల వేలి ముద్రలు సేకరించి క్రిమినల్ రికార్డులతో సరి పోల్చారు. పౌరులు ఎటువంటి అనుమానాస్పద వ్యక్తులను గమనించిన వెంటనే లోకల్ పోలీసులకు లేదా డయల్ 100కి సమాచారం ఇవ్వాలని ఎస్సై ప్రజలకు విజ్ఞప్తి చేశారు.


తనిఖీలు నిర్వహిస్తున్న పోలీస్ సిబ్బంది

## నేటి నుండి ఎంపిటీసీ, జెడ్పిటిసి నామినేషన్ల స్వీకరణ

**మహబూబ్‌నగర్ (నవాబుపేట), అక్టోబరు 8 ప్రభాతవార్త :** నేటి నుండి 5 క్లస్టర్ల జీపీలలో ఎంపిటీసీల నామినేషన్ల పత్రాలు, జడ్పిటిసిల నామినేషన్లు మండల ఎంపీడీవో కార్యాలయంలో స్వీకరిస్తారని, మండల ప్రత్యేక అధికారి సునీత, ఎంపీడీఓ జయరాంనాయక్‌లు తెలిపారు. ఈ నెలలో నిర్వహించే జడ్పిటిసి ఎంపిటిసి ఎన్నికలకు సంబంధించిన ప్రక్రియ పూర్తయినట్లు, జెడ్పిటిసికి పోటీ చేసే అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సమర్పించాలని, అదేవిధంగా ఎంపిటీసీకి పోటీ చేసే అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను మండల పరిధిలో ఐదు క్లస్టర్లుగా ఏర్పాటు చేశారు. అవి1.కొల్లూరు క్లస్టర్ కొల్లూరు గ్రామపంచాయతీలో ఏర్పాటు చేయడం జరిగింది. ఇక్కడ ఎంపిటిసి పోటీ చేసిన అభ్యర్థులు ఇందులోపోటీ చేసిన అభ్యర్థులు, కొల్లూరు పోమాల, కామారం ఎంపిటిసి స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలను సమర్పించాలి. 2. నవాబుపేట క్లస్టర్ ను నవాబుపేట గ్రామపంచాయతీలో ఏర్పాటు చేయడం జరిగింది. ఇందులో నవాబుపేట,చౌడూర్, గురుకుంట ఎంపిటీసీ స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులుతమ నామినేషన్ పత్రాలుసమర్పించాల్సి ఉంటుంది.3.యన్మన్ గండ్ల క్లస్టర్‌ను, యన్మన్ గండ్ల గ్రామపంచాయతీలో ఏర్పాటు చేయడం జరిగింది. ఇందులో యన్మన్ గండ్ల, కొండాపూర్,కాకర్లపహాడ్ ఎంపిటిసి స్థానాలకు పోటీచేసే అభ్యర్థులు తమను నామినేషన్ పత్రాలను సమర్పించవలసి ఉంటుంది. 4.కారుకొండ క్లస్టర్‌ను కారుకొండ గ్రామపంచాయతీలో ఏర్పాటు చేయడం జరిగింది. ఇందులో కారకొండ, తీగలపల్లి, కూచూర్ ఎంపిటిసి స్థానాలకు పోటీ చేసే అభ్యర్థులు తమ నామినేషన్ పత్రాలు సమర్పించవలసి ఉంటుంది.5.లోకిరేవు క్లస్టర్‌ను లోకిరేవు గ్రామపంచాయతీలో ఏర్పాటుచేయడం జరిగింది. ఇందులో లోకిరేవు, ఇప్పటూర్,కిషన్ గూడాలఎంపిటిసి స్థానాల కు పోటీ చేసే అభ్యర్థులు ఎన్నికల నోటిఫికేషన్ లో విధించిన నిబంధనలకు అనుగుణంగా తగు పత్రాలను జతచేస్తూ తమ నామినేషన్ పత్రాలను సమర్పించవలసి ఉంటుందని వారు తెలిపారు.

## ఓట్ల చోరీ ప్రజాస్వామ్యానికి ప్రమాదకరం

### దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి



**దేవరకద్ర, అక్టోబరు8 ప్రభాతవార్త:** మోడీ పాలనలో ప్రజాస్వామ్యం ప్రమాదంలో ఉందని, బిజెపి ప్రభుత్వం వ్యవస్థలను దుర్వినియోగం చేస్తుందని దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూదన్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓట్ చోరీకి వ్యతిరేకంగా రాహుల్ గాంధీ చేస్తున్న పోరాటానికి మద్దతుగా భారత రాజ్యాంగం కల్పించిన హక్కు కాపాడుకునే ప్రయత్నానికి అందరూ సంతకం చేసి ఓట్ చోరీ వ్యతిరేక కార్యక్రమంలో భాగస్వాములు కావాలని అన్నారు. అదేవిధంగా ప్రతి గ్రామం నుండి ఓట్ చోరీకి వ్యతిరేకంగా ప్రతి గ్రామంలో 100 మందితో సంతకాల సేకరణ చేపట్టాలని పిలుపునిచ్చి, సంతకాల సేకరణ కార్యక్రమంలో స్వయంగా పాల్గొన్నారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత ప్రాధాన్యత ఉందని, ప్రజలు తమ ఓటు హక్కు ద్వారా ప్రభుత్వాలను నిర్ణయిస్తారని, ఎంతో ప్రాధాన్యత కలిగిన ఓట్ల వ్యవస్థను ఎన్నికల సంఘం సహకారంతో బిజెపి కలుషితం చేసిందని పేర్కొన్నారు. 2024 లోక్ సభ ఎన్నికల్లో భాగంగా కర్ణాటక రాష్ట్రంలోని బెంగళూరు సెంట్రల్ లోక్ సభ స్థానంలోని మహాదేవపుర అసెంబ్లీ సెగ్మెంట్లో ఒక లక్ష 250 ఓట్ల దొంగఓట్ల దొంగతనం జరిగిందని,రాహుల్ గాంధీ ఆధారాలను బయటపెట్టిన, ఎన్నికల సంఘం చర్యలు తీసుకోకుండా ఓట్‌చోరిని బయటపెట్టిన రాహుల్ గాంధీని క్షమాపణ చెప్పాలని, అఫిడవిట్ ఇవ్వాలని ఎన్నికల సంఘం కోరడం హాస్యాస్పదమని దేవరకద్ర ఎమ్మెల్యే జి.మధుసూదన్ రెడ్డి అన్నారు.

## సిజెపై దాడి రాజ్యాంగం పై దాడియే!


మండల కేంద్రంలో నిరసన తెలుపుతున్న కేవీపీఎస్ నాయకులు

**బిజినేపల్లి, అక్టోబరు8 ప్రభాతవార్త:** భారతదేశ సర్వోన్నత న్యాయస్థానం సీజే బిఆర్ గవాయి పై దాడిని భారత రాజ్యాంగం పై దాడిగా పరిగణించాలని, దాడి చేసిన వ్యక్తిపై వెంటనే చర్యలు తీసుకోవాలని కెవిపిఎస్ జిల్లా ఉపాధ్యక్షులు గుంపల్లి అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం కెవిపిఎస్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని పూలే అంబేద్కర్ చౌరస్తాలో దాడికి నిరసన వ్యక్తం చేశారు. అశోక్ మాట్లాడుతూ ఒక సుప్రీం కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి పై దాడి జరిగితే నిందితుడు కిషోర్ దాస్‌ను అరెస్టు చేసి వెంటనే విడుదల చేయడం దుర్మార్గమని అన్నారు. నిందితుడు కిషోర్ దాస్‌ను వెంటనే మళ్ళీ అరెస్టు చేసి శిక్షించాలని డిమాండ్ చేశారు. అతనిపై తాత్కాలిక చర్యలు తీసుకోవడం సమంజసం కాదని అన్నారు. ఆర్ఎస్ఎస్ బిజెపి న్యాయస్థానాలకు వ్యతిరేకమని అవి ఉంటే తమ భావజాలంలోని మనువాదాన్ని అమలు చేయనీయడం లేదని దానికి కక్షతోనే ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు సత్యనారాయణ, హనుమంతు, వెంకటయ్య,రాములు, సుధాకర్, శ్రీను పాల్గొన్నారు.

## ఎస్ఎంవీలో హెల్త్ క్యాంప్ విజయవంతం

### - డాక్టర్ రఘు సామల, డాక్టర్ వంశీకృష్ణ ఆధ్వర్యంలో వైద్య సేవలు

**మహబూబ్‌నగర్,అక్టోబర్8, ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్‌లోని శ్రీ ఎస్ఎంవీ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్‌లో సెంట్రల్ లైబ్రరీ సమీపంలోని వన్‌టౌన్ బ్రాంచ్‌లో ఉచిత న్యూరో సర్జరీ హెల్త్ క్యాంప్ నిర్వహించారు. సమాజ సేవా కార్యక్రమంలో చేపట్టిన ప్రత్యేక వైద్య శిబిరాన్ని హైదరాబాద్ ఏఐజీ హాస్పిటల్స్ కన్సల్టెంట్ న్యూరో సర్జన్ డాక్టర్ రఘు సామల, కన్సల్టెంట్ మెడికల్ న్యూరో డాక్టర్ వంశీకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆయన దేశంలోని ప్రముఖ న్యూరో సర్జన్లలో ఒకరుగా, ఢిల్లీ ఎయిమ్స్, చండీగఢ్ పీజీఐఎంఈఆర్ వంటి అగ్రశ్రేణి వైద్య విద్యాసంస్థల్లో విశేష విద్యా, వైద్య అనుభవం సంపాదించారు. డాక్టర్ రఘు సామల ఉస్మానియా మెడికల్ కాలేజ్ మాజీ విద్యార్థి. శిబిరంలో డాక్టర్ రఘు సామల న్యూరోలాజికల్ వ్యాధులు, వెన్నెముక సంబంధిత సమస్యలు,ట్రామా మేనేజ్‌మెంట్‌పై ఉచిత కన్సల్టేషన్‌లు, డయాగ్నస్టిక్ సేవలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణలో ప్రతి ప్రాంతానికీ ఆధునిక న్యూరో సర్జరీ సేవలను అందించడమే తమ లక్ష్యమన్నారు. హాస్పిటల్ ఆధునిక మల్టీ స్పెషాలిటీ సదుపాయాల సహాయంతో వైద్య సేవలు అవసరమైన కానీ చేరుకోలేని ప్రజలకు సులభంగా చేరాలని మా ప్రయత్నం," అని తెలిపారు. హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రమేష్ గౌడ్, సీనియర్ కన్సల్టెంట్లు డాక్టర్ కార్తిక్ (ఆర్థోపెడిక్స్) డాక్టర్ రాజేష్ (ఓబీజీ)సమన్వయంతో ఈశిబిరం విజయవంతంగా నిర్వహించారు. శిబిరంలో జనరల్ మెడిసిన్, ఆర్థోపెడిక్స్, గైనకాలజీ, న్యూరో సైన్స్ విభాగాల్లో సేవలు అందించారు.

# స్థానిక సంస్థల ఎన్నికలను నిర్వహించేందుకు పటిష్టమైన చర్యలు చేపట్టాలి

■వీసీలో ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని
■నామినేషన్ల స్వీకరణకు అన్ని ఏర్పాట్లు పూర్తి : గద్వాల జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్

**గద్వాల టౌన్ అక్టోబర్ 8, ప్రభాతవార్త:** ఈనెల 9వ తేదీ నుండి 11వ తేదీ వరకు నిర్వహించనున్న జడ్పీటిసి, ఎంపీటీసీ మొదటి విడత ఎన్నికల నామినేషన్ల స్వీకరణకు అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ తెలిపారు. బుధవారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని ఇతర ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మొదటి విడతలో జరిగే ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, లా అండ్ ఆర్డర్ నిర్వహణ తదితర అంశాలపై జిల్లా కలెక్టర్లతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై మొదటి విడతలో జరిగే ఎన్నికల నిర్వహణ ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు జిల్లా ఎన్నికల యంత్రాంగం పటిష్ట చర్యలు


వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్లకు ఆదేశాలు జారీ చేస్తున్న ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని

తీసుకోవాలని ఆమె కలెక్టర్లను ఆదేశించారు. ఎన్నికల నిర్వహణ, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, లా అండ్ ఆర్డర్ పరిస్థితుల పర్యవేక్షణ వంటి అంశాలపై స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. తొలి విడతలో జరిగే ఎన్నికల నామినేషన్ ప్రక్రియను సజావుగా సాగేందుకు పోలీస్ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. జిల్లా కలెక్టర్లకు ఎస్పీలకు పలు సూచనలు సల హాలు అందించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నా జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ మాట్లాడుతూ, జిల్లాలో తొలి విడతలో జరిగే 69 ఎంపీటీసీ, 05 జడ్పీటిసి స్థానాలకుజరిగే ఎన్నికలకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేయడం జరిగిందని, నామినేషన్ల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు ఎన్నికల సిబ్బందికి శిక్షణతరగతులను నిర్వహించి పూర్తి చేయడం జరిగింద న్నారు. ఎన్నికల నిర్వహణలో బాధ్యతలు నిర్వహించే రిటర్నింగ్ అధికారులకు శిక్షణ తరగతుల ద్వారా స్పష్టమైన ఎన్నికలకు సంబంధించిన అన్ని సూచనల ను క్షుణ్ణంగా అవగాహన కల్పించడం జరిగిందని తెలిపారు. 9వ తేదీ ఉదయం 10:30 గంటలనుండి 11వతేదీ సాయంత్రం 5గంటల వరకు స్వీకరించను న్నట్లు కలెక్టర్ తెలియజేశారు. ఈ వీడియో సమావేశంలో జిల్లా ఎస్పీ శ్రీనివాస రావు, అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, డిపిఓ నాగేంద్రం, ట్రేని డిప్యూటీ కలెక్టర్ మనోజ్ కుమార్ రెడ్డి, ఎన్నికల నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## కానిస్టేబులు కుటుంబసభ్యులకు చెక్ అందజేసిన ఎస్పీ


కానిస్టేబుల్ కుటుంబ సభ్యులకు చెక్‌ను అందజేస్తున్న ఎస్పీ శ్రీనివాస రావు

**గద్వాల టౌన్ అక్టోబర్8, ప్రభాతవార్త:** రోడ్డు ప్రమాదంలో మరణించిన కానిస్టేబుల్ శ్రావణి తల్లి దండ్రులకు ఐదు లక్షల భీమా చెక్కును జిల్లా ఎస్పీ టి.శ్రీనివాసరావు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జోగులాంబ గద్వాల్ జిల్లా పోలీస్ శాఖకు చెందిన కానిస్టేబుల్ శ్రావణి గత సంవత్సరం సెప్టెంబర్ నెల లో రోడ్ ప్రమాదంలో దురదృష్టవశాత్తు మృతిచెందిన విషయం తెలిసిందేనని, ఈ నేపథ్యంలో, ఆమె కుటుంబానికి 5,00,000/ రూపాయల చెక్ రావడంతో బుధవారం జిల్లా ఎస్పీకార్యాలయంలో ఆమెతల్లి దండ్రులకు అందజేయడం జరిగిందన్నారు. యునైటెడ్ ఇండియా ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్ నుండి గతంలోనే పది లక్షలు రూపాయల ఇన్సూరెన్స్ ఇవ్వగా, ప్రస్తుతం చీఫ్ ఆఫీస్ వెల్ఫేర్ గ్రూప్ పర్సనల్ ఆక్సిడెంట్ ఇన్సూరెన్స్ లో భాగంగా, శ్రావణి తల్లిదండ్రులుఇంద్రమ్మ, ఈశ్వరయ్యలకు రూ. 5 లక్షల చెక్ ఇవ్వడం జరిగిందని తెలిపారు. జిల్లా పోలీస్ శాఖ తరపున శ్రావణి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, భవిష్యత్తులో అన్ని విధాలా సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ బి. సతీష్ కుమార్, ఆఫీస్ సూపరింటెంట్ బి. నాగమణి, సీనియర్ అసిస్టెంట్ విజయలక్ష్మి మరియు రోడ్డు ప్రమాదంలో చనిపోయిన కానిస్టేబుల్ శ్రావణి తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఉండవెల్లి వికేర్ కోల్డ్ స్టోరేజిల్లో ఐటీ అధికారుల సోదాలు

**అలంపూర్ అక్టోబర్ 8, ప్రభాతవార్త :** జోగులాంబ గద్వాల జిల్లా, ఉండవెల్లి మండలం, అల్లంపూర్ చౌరస్తా సమీపం లోని జాతీయ రహదారి ప్రక్కన ఉన్న వికేర్ సీడ్స్ వ్యవసాయ ప్రైవేట్ ప్రాసె సింగ్ కేంద్రంలో ఐటీ సోదాలు చేసిన అధికారులు. ఐటీ అధికారులు ప్రత్యేక వాహనాల్లో వచ్చి ఏపీ రాష్ట్రంలోని కర్నూలు జిల్లా గార్గేయపురం, గుంటూరు జిల్లాలోని వి కేర్ కోల్డ్ స్టోరేజీలో తనిఖీలు చేస్తున్నట్లు తెలుస్తుంది. రాష్ట్రంలోని పప్పుదినుసులు, హోల్సేల్, వ్యాపారుల ఇళ్లల్లో ఐటీ దాడుల నేపథ్యంలో ఉండవల్లి సమీపంలోని వి.కేర్ సీడ్స్ కంపెనీలో పప్పు దినుసులపై పెద్ద ఎత్తున లావాదేవీలు జరిగినట్లుగా. ఐటీ అధికారులు బుధవారం సోదాలు జరిపారు. ఈ సందర్భంగా సంస్థయజమానులు సిబ్బంది ఫోన్లను.. స్వాధీనం చేసుకున్న ఐటీ శాఖ అధికారులు. పెద్ద ఎత్తున లావాదేవీలు జరిగినట్లు అనుమానవ్యక్తం చేస్తున్న అధికారులు. రాష్ట్రంలో పప్పు దినుసులు హోల్సేల్ వ్యాపారుల ఇళ్లలో దాడులు చేస్తున్నట్లు తెలుస్తోంది. గోదాముల్లో నిల్వ ఉన్న ధాన్యం బస్తాల స్టాక్ రిజిస్టర్లు, పంటల వివరాలను క్షుణంగా పరిశీలించారు. రైతుల పేరిట పంటలను కొనుగోలు చేసి స్టోరేజ్లో దాచడంతోపాటు రైతుల పేరుతోనే క్రయవిక్రయాలు చేస్తూ జీరో దందా చేస్తున్నట్లు ఆరోపణలతో అధికారులు సోదాలు జరిపినట్లు తెలుస్తోంది.




## బాల కార్మికులను పాఠశాలలో చేర్పించిన జిల్లా న్యాయ సేవాధికార సంస్థ


పొలం పనుల దగ్గర పిల్లలను అదుపులోకి తీసుకుంటున్న న్యాయ సేవాధికార సంస్థ సభ్యులు

**గద్వాల టౌన్ అక్టోబర్ 8, ప్రభాతవార్త:** జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో రెస్క్యూ ఆపరేషన్‌లో భాగంగా ధరూర్ మండలం పరిధిలో పొలాలలో పనిచేస్తున్న ముగ్గురు బాల కార్మికులను గుర్తించి, సంబంధిత పాఠశాలలో చేర్పించారు. అలాగే పాతపాలెం లోని పొలంలో పనిచేస్తున్న ఒక బాల కార్మికుడిని డ్రాపౌట్ గుర్తించి, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ సభ్యులు, చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా పాఠశాలలో అందించబడుతున్న మధ్యాన్న భోజనంలో ఆహార నాణ్యత, విద్యార్థులకు మెనూప్రకారంపాలో కావాలనితెలిపారు. పాఠశాలలో ఉపాధ్యాయుల కొరత ఉందని తెల్సుకున్నారు. ఈ సందర్భంగా లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ మాట్లాడుతూ బాలల శ్రమ నేరంగా మాత్రమే కాకుండా, వారి భవిష్యత్తును నాశనం చేసే ప్రమాదకరమైన అంశం అని ప్రతి ఒక్కరూ దీనిపై చైతన్యం కలిగి ఉండాలి అని అన్నారు. లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్స్ వి. రాజేందర్, బి. శ్రీనివాసులు, డి. లక్ష్మణ స్వామి, చైల్డ్ వెల్ఫేర్ అధికారులు జయన్న, సురేష్ పాల్గొన్నారు.



## వల్లూరు, ధర్మవరం స్టేజీలలో వనపర్తి ఆర్టీసీ బస్సులు నిలపాలి

### డిపో మేనేజర్‌కు గ్రామస్తుల వినతి

**ఇటిక్యాల అక్టోబర్ 8, ప్రభాతవార్త:** వనపర్తి డిపో నుండికర్నూలుకు వెళ్లే ఆర్టీసీ బస్సులను ఇటిక్యాల మండల పరిధిలోని 44నెంబర్ జాతీయ రహదారి పక్కన ఉన్న వల్లూరు. ధర్మవరం స్టేజీల వద్ద ఆర్టీసీ బస్సులను నిలపాలని ఆ గ్రామాలకు చెందినవారు వనపర్తి డిపో మేనేజర్ దేవేందర్ గౌడ్ కు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా డిపో మేనేజర్ సానుకూలంగా స్పందించి జాతీయ రహదారికి అటు ఇటు వైపు కూడా స్టేజీలలో తెలంగాణ ఆర్టీసీ రిక్వెస్ట్ స్టాపు అని బోర్డులు ఏర్పాటు చేసుకోవాలని చెప్పారు. ప్రస్తుతానికి రిక్వెస్ట్ స్టాపు ఏర్పాటు చేస్తామని ఆ తర్వాత దాన్ని శాశ్వత స్టాప్‌గా పెడతామనివనపర్తి డిపో మేనేజర్ దేవేందర్ గౌడ్ గ్రామాల ప్రజలకు సూచించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో గోవర్ధన్‌రెడ్డి. నాగేశ్వర్ రెడ్డి. కృష్ణమాచారి. శ్రీహరి తదితరులు ఉన్నారు.

# ఏటిసితో భవిష్యత్తుకు బాట

● విద్యార్థులకు థియరీ, ప్రాక్టికల్స్ తో పాటు అత్యాధునిక సాంకేతిక శిక్షణనందించాలి
● మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ విజయేంద్ర బోయి

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబరు8, ప్రభాతవార్త:** ఏ.టి.సి.లో శిక్షణ పొందుతున్న విద్యార్థులకు థియరీ, ప్రాక్టికల్ క్లాసులు ఆధునిక యంత్రాలతో సమగ్రంగా నిర్వహించాలని, విద్యార్థులకు తాజా సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ ఇవ్వాలని జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి ఆదేశించారు. ప్రభుత్వ ఐ.టి.ఐ. (బాలుర), (బాలికల) ఆవరణలో ఏర్పాటు చేసిన అడ్వాన్స్డ్ ట్రైనింగ్ సెంటర్ ను జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ తో కలిసి బుధవారం సందర్శించారు. ఏ.టి.సి లో ఆధునిక సాంకేతిక శిక్షణ కోర్సుల గురించి కలెక్టర్‌కు ప్రిన్సిపాల్ వివరించారు. ప్రిన్సిపాళ్లు, బోధనా సిబ్బందికి కలెక్టర్ సూచనలుచేశారు. ఏ.టి.సిలో అందిస్తున్న కోర్సులు దేశీయంగా మాత్రమే కాకుండా విదేశాలలో కూడా అత్యుత్తమ ఉపాధి అవకాశాలు కల్పించే కోర్సులని, అందువల్ల విద్యార్థులకు ఆధునిక నైపుణ్యాలు అందించడం అత్యవసరమని కలెక్టర్ పేర్కొన్నారు. తొలుత జిల్లా కేంద్రం లో ని బస్టాండ్ సమీపంలోని బాదం రామస్వామి సరోజా దేవి మున్సిపాలిటీ గోల్డెన్ జూబ్లీ ఆడిటోరియం, మున్సిపాలిటీలో కళా భారతి, భవనాలను కలెక్టర్ పరిశీలించారు. బాదం రామస్వామి సరోజా దేవి మున్సిపాలిటీ గోల్డెన్ జూబ్లీ ఆడిటోరియం ను పరిశీలించి కావలసిన రిపేర్ ల గురించి తెలుసుకుని సూచనలు చేశారు. కళా భారతి నిర్మాణం ను పరిశీలించి నిర్మాణ ప్రగతి గురించి తెలుసుకున్నారు. కార్యక్రమాల్లో బాలు ఐ.టి.ఐ ప్రిన్సిపల్ శ్రీ బి. శాంతయ్య, బాలికల ఐ.టి.ఐ ప్రిన్సిపల్ ఎస్. గోపాల్ నాయక్, ఐ.టి.ఐ / ఏ.టి.సి బోధనా సిబ్బంది పాల్గొన్నారు.


యంత్రాలను పరిశీలిస్తున్న కలెక్టర్ విజయేంద్ర బోయి

## ఆస్ట్రో ల్యాబ్ సందర్శన - ఆసక్తిగా పరిశీలించిన కలెక్టర్

**మహబూబ్‌నగర్ బ్యూరో, అక్టోబరు8, ప్రభాతవార్త:** కలెక్టర్ విజయేంద్ర బోయి, అడిషనల్ కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, జిల్లా విద్యాశాఖ అధికారి ప్రవీణ్ కుమార్ మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలోని మోడల్ బేసిక్ స్కూల్ లో ఆస్ట్రో ల్యాబ్‌ను సందర్శించారు. ఢిల్లీ నుంచి వచ్చిన ఆస్ట్రో ఫిజిక్స్ ఉపాధ్యాయుడు మిశ్రా కలెక్టర్‌కు ల్యాబ్‌లో ఉన్న టెలిస్కోప్, 42 రకాల ప్రయోగాలు, నక్షత్ర శాల, గ్రహాల గురించి ఏ విధంగా ఈ ల్యాబ్‌ను ఉపయోగించవచ్చు అనే విషయాలు వివరించారు. కలెక్టర్ ప్రత్యేకంగా టెలిస్కోప్ గురించి అడిగి ఆసక్తి గా తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏఎంవో దుంకుడు శ్రీనివాస్, సీఎంవో సుధాకర్ రెడ్డి, హెచ్ఎం బాసిత్ తదితరులు పాల్గొన్నారు.


ట్యాబ్ వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

# స్థానిక ఎన్నికల్లో సత్తా చాటుదాం..!

### సిపిఐ జిల్లా కార్యదర్శి విజయరాములు

**ఆత్మకూర్ అక్టోబర్8, ప్రభాతవార్త:** త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మక్తల్ నియోజకవర్గం లోని ఉమ్మడి ఆత్మకూరు మండలంలో సిపిఐ పార్టీ సత్తా చాటాలని వనపర్తి జిల్లా సిపిఐ కార్యదర్శి విజయరాములు అన్నారు. బుధవారం రోజు మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని సిపిఐ కార్యాలయంలో మండలంలోని ముట్లంపల్లి గ్రామానికి చెందిన సిపిఎం పార్టీ నుండి రాములు నాయకత్వంలో పదిమంది సిపిఐ పార్టీలో చేరడంతో జిల్లా కార్యదర్శి విజయరాములు ఆత్మకూరు మండల కార్యదర్శి లక్ష్మీనారాయణ రెడ్డి తదితరులు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి విజయరాములు మాట్లాడుతూ ప్రతి ఎన్నికల్లో కాంగ్రెస్ మరియు టిఆర్ఎస్ పార్టీలో ప్రజలకు ఇచ్చినవాగ్దానాలను అమలు చేయకుండా కాలయాపన చేస్తున్నాయని ఆయన తీవ్రస్థాయిలో ఆరోపించారు గత శాసనసభ ఎన్నికల సమయంలో రేవంత్ రెడ్డి ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను ఏమాత్రం పరిగణలోకి తీసుకోకుండా ప్రజల దృష్టిని మళ్లించే విధంగా చర్యలు చేపట్టడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా ఒక రైతుకు కూడా పూర్తిస్థాయిలో రుణమాఫీ కాలేదని అంతేకాకుండా రైతు భరోసానిధులను ఇప్పటికే రెండుసార్లు ఎగవేయడం జరిగిందని రాష్ట్రవ్యాప్తంగా మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం తప్ప ఇచ్చిన వాగ్దానాలలో ఒకటి కూడా అమలు చేయకపోవడం కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యానికి నిదర్శనమని ఆయన తీవ్రస్థాయిలో ఆరోపించారు. రాష్ట్రవ్యాప్తంగా సిపిఐ పార్టీ కాంగ్రెస్ పార్టీతో స్నేహబంధం కొనసాగిస్తున్నప్పటికి ప్రజావ్యతిరేక విత్తనాలు ఎప్పటికప్పుడు ఎండ కడుతూ ప్రజల పక్షాన పోరాటాలు నిర్వహించడంలో అగ్రభాగాల నిరుస్తుందని ఆయన అన్నారు ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు శ్రీహరి, మోష, రాబర్ట్ తదితరులతో పాటుగా పలువురు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.


సిపిఎం నుండి సిపిఐ పార్టీలోకి నాయకులను ఆహ్వానిస్తున్న జిల్లా కార్యదర్శి విజయరాములు

## ఆర్ఎస్ఎస్ శతాబ్ది ఉత్సవాలలో ముదిరాజులందరూ పాల్గొనాలి

**నారాయణ పేట, అక్టోబరు8 ప్రభాతవార్త:** ఆర్ఎస్ఎస్ ఏర్పడి 100 సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంలో శనివారం పద సంచలన కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో ప్రతి ముదిరాజు సభ్యుడు కూడా చురుకుగా పాల్గొనాలని నిర్ణయంతో ఈ సమావేశం ఏర్పాటు చేయబడింది. జిల్లా అధ్యక్షులు సరాఫ్ నాగరాజు, పట్టణ అధ్యక్షులు మిర్చి వెంకటయ్య, పట్టణ ఉపాధ్యక్షులు పల్లా వెంకటరాములు, ప్రధాన కార్యదర్శి మల్లేశ్ ఈ సమావేశంలో పాల్గొన్నారు. మాజీ ముదిరాజ్ సంఘ అధ్యక్షులు గురు మేస్త్రీ కాకర్ల భీమయ్య, వార్డు అధ్యక్షులు రాజు, బోకుల రాజు జనార్దన్, లక్ష్మణ్, గోవింద్ గిరి తదితరులు కూడా హాజరయ్యారు. సభలో సమాజ ఐక్యత సేవా కార్యక్రమాల ప్రాధాన్యం యువత ఆర్ఎస్ఎస్ విలువలను అనుసరించి ముందుకు రావాలనే అంశాలపై చర్చించబడింది. జిల్లా స్థాయిలో నిర్వహించనున్న శతాబ్ది ఉత్సవాలకు సిద్ధం కావాలని నాయకులు పిలుపునిచ్చారు.



## గ్రామ పరిశుభ్రతపై దృష్టి

### ఊట్కూర్‌లో డ్రైనేజీల శుభ్రత చర్యలు ప్రారంభం

**ఊట్కూర్, అక్టోబరు 8 ప్రభాతవార్త :** వర్షాకాలం నేపథ్యంలో ఊట్కూర్ గ్రామపంచాయతీ ప్రత్యేక శుభ్రత చర్యలను ప్రారంభించింది. గ్రామంలో దోమల వ్యాప్తి, మురుగు నీటి నిల్వలు, దుర్వాసన వంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యగా పంచాయతీ అధికారులు డ్రైనేజీల శుభ్రత పనులు చేపట్టారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పలు వీధుల్లో డ్రైనేజీలను శుభ్రం చేసి, పేరుకుపోయిన చెత్త, మురుగును తొలగించారు. ఫలితంగా నీరు నిల్వ ఉండి వ్యాధులు వ్యాపించే పరిస్థితులు తగ్గనున్నాయని అధికారులు తెలిపారు. పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు మాట్లాడుతూ ప్రతి ఇంటి ముందు పరిశుభ్రత పాటించడం ప్రతి పౌరుడి బాధ్యత. గ్రామం పరిశుభ్రంగా ఉండేందుకు ప్రజల సహకారం అత్యవసరం. వర్షాకాలంలో నీరు నిల్వ ఉండకుండా చర్యలు నిరంతరం కొనసాగిస్తాం" అని అన్నారు. గ్రామస్థులు పంచాయతీ సిబ్బంది కృషిని అభినందిస్తూ, గ్రామాభివృద్ధికి పరిశుభ్రత ఎంతో కీలకం అని పేర్కొన్నారు.


డ్రైనేజీలను శుభ్రం చేస్తున్న దృశ్యం

## పెండ్లికి ఆర్థిక సాయం


ఆడకూతురు వివాహానికి ఆర్థిక సాయం అందిస్తున్న నరేష్ నాయక్

**రాజాపూర్, అక్టోబరు 8 ప్రభాతవార్త:** రాజాపూర్ మండలం సింగమ్మగూడ గ్రామ పంచాయతీకి చెందిన సభావట్ రాంజ్యా నాయక్ కూతురు అపర్ణ వివాహానికి గురువారంయువ నాయకులు నరేష్ నాయక్ 10 వేల రూపాయలు ఆర్థికసాయం అందజేశారు. ఆర్థిక సాయం అందించిన నరేష్ నాయక్‌కు పెళ్లికూతురు కుటుంబ సభ్యులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. మున్ముందు గ్రామ పంచాయతీలో జరిగే ఆడబిడ్డల వివాహానికి తనకు తోచిన సహాయం అందించేందుకు ఎల్లప్పుడు ముందు వరుసలో ఉంటానని నరేష్‌నాయక్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, తండా యువకులు తదితరులు పాల్గొన్నారు.

## న్యాయమూర్తిపై దాడికి వ్యతిరేకంగా నిరసన

**మహబూబ్‌నగర్, అక్టోబరు8, ప్రభాతవార్త:** పాలమూరు విశ్వవిద్యాలయంలో సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బి.ఆర్ గవాయి పై అమానవీయమైన ఘటనను వ్యతిరేకిస్తూ పాలమూరు విశ్వవిద్యాలయంలో సమావేశం ఏర్పాటు చేశారు. సమావేశానికి ముఖ్య అతిథిగా డాక్టర్ నాగం కుమారస్వామి హాజరై ప్రసంగించారు. భారతదేశంలో డాక్టర్ బి.ఆర్అంబేద్కర్ అందించినటువంటి రాజ్యాంగంలో న్యాయవ్యవస్థచాలా అత్యున్నతమైనదని అలాంటి న్యాయ వ్యవస్థ ప్రాతినిధ్యం వహిస్తూ అత్యున్నత పదవిలో ఉన్న బిఆర్ గవాయి పై జరిగిన సంఘటన భారతదేశ ప్రజలు తమపై జరిగినటువంటి దాడిగా భావిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో న్యాయ కళాశాల ప్రిన్సిపల్ మాళవి, న్యాయ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ వి. భూమయ్య, ప్లేస్మెంట్ ఆఫీసర్ పాలమూరు విశ్వవిద్యాలయం డాక్టర్ ఎస్ ఎన్ అర్జున్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ యూనివర్సిటీ పీజీ కాలేజ్ డాక్టర్ ఎం కృష్ణయ్య, ప్రిన్సిపల్ ఫార్మసీ కాలేజ్ డాక్టర్ సిహెచ్ రవికాంత్, అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎన్‌కిషోర్, అసిస్టెంట్ ప్రొఫెసర్స్ డాక్టర్ రాజ్ కుమార్, డాక్టర్ఎం జ్ఞానేశ్వర్, డాక్టర్ ఎస్ రవికుమార్, డాక్టర్ బి పర్వతాలు, డాక్టర్ వి. విజయభాస్కర్, డాక్టర్ పి శిలాస్, డాక్టర్ గురుస్వామి డాక్టర్ ఎం మధు, డాక్టర్ ఈశ్వర్ కుమార్, కే మాధురి మోహన్ డాక్టర్ బి రవీందర్ గౌడ్ విద్యార్థులు పాల్గొన్నారు.

## ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సీ కెమిస్ట్రీ కోర్సులో స్పాట్ అడ్మిషన్

**జడ్చర్ల, అక్టోబరు8, ప్రభాతవార్త:** తెలంగాణ గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో జడ్చర్ల లోని గిరిజన పురుషుల డిగ్రీ , పీజీ కళాశాల లో ఐదు సంవత్సరాల ఇంటిగ్రేటెడ్ ఎంఎస్సీ కెమిస్ట్రీ కోర్సులో స్పాట్ అడ్మిషన్స్ కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్‌కె. పి. నిరీక్షణరావు ఒక ప్రకటనలో తెలిపారు ఇంటర్మీడియట్‌లో సైన్స్ బ్యాక్‌గ్రౌండ్‌తో కనీసం 40 మార్కులు సాధించిన పురుష విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని ఆయన తెలిపారు ఎస్టీ -33, ఎస్సీ- 1, ఓసీ -1, అనాథలు -1, వికలాంగులు -1, క్రీడలు -1, అందుబాటులో ఉన్న సీట్లు కలవని వెల్లడించారు దరఖాస్తు చేసుకొనేందుకు అక్టోబర్ 15 చివరి తేదీ అని ఆయ న తెలిపారు. విద్యార్థులు నేరుగా కళాశాలను సంప్రదించి దరఖాస్తు చేసుకోవచ్చని, మరిన్ని వివరాలకు 7901097703 ఫోన్ నంబర్లను సంప్రదించవచ్చని సూచించారు. ప్రకటనలో తెలిపారు.

## చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

**ఇటిక్యాల అక్టోబర్ 8, ప్రభాతవార్త;** మండల పరిధిలోని సాతర్ల గ్రామానికి చెందిన దామోదర్ గౌడ్ ( 35 ) అనే వ్యక్తి కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎస్సై కే. రవి తెలిపారు. వారి కథనం మేరకు బుద్ధుడు దామోదర్ గౌడ్ తనకు మతిస్థిమితం బాగా లేక మంగళవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఏదో పురుగుల మందు సేవించగా చికిత్సనిమిత్తం కుటుంబ సభ్యులు కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు మృతుని భార్య ఈడిగ లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై కే.రవి తెలిపారు.

## వ్యక్తి అదృశ్యం: కేసు నమోదు

**ఆత్మకూర్ అక్టోబర్8, ప్రభాతవార్త:** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని భార్గవి నగర్కు చెందిన హోటల్ విష్ణు అదృశ్యమైనట్లుగా ఆత్మకూరు ఎస్సై నరేందర్ విలేకరులకు తెలిపారు. పట్టణంలోని పోలీస్ స్టేషన్ ఆవరణలో హోటల్ నిర్వహిస్తూ జీవనం కొనసాగించే విష్ణు మంగళవారం సాయంత్రం నుండి కనిపించకుండా వెళ్లిపోవడంతో విష్ణు భార్య పల్లవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లుగా ఎస్సై విలేకరులకు తెలిపారు.

## గండీడ్ మండల వ్యవసాయ అధికారిగా జి. రాధమ్మ

**గండీడ్ అక్టోబర్8, ప్రభాతవార్త:** గండీడ్ మండల వ్యవసాయ అధికారిగా జి. రాధమ్మ బాధ్యతలు స్వీకరించారు. గతంలో ఈమె రంగారెడ్డి జిల్లా యాచారం మండలంలో వ్యవసాయ విస్తరణ అధికారిగా పనిచేస్తూ పదోన్నతి పై మహబూబ్ నగర్ జిల్లా గండీడ్ మండల వ్యవసాయ అధికారిగా వచ్చారు.

## పోషణ్ మాసం కార్యక్రమం




**మహబూబ్‌నగర్, అక్టోబరు8, ప్రభాతవార్త:** పోషణ్ మాసం కార్యక్రమంలో భాగంగా బుధవారం మహబూబ్‌నగర్ రూరల్ ప్రాజెక్ట్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీడీవో కరుణశ్రీ పాల్గొని మాట్లాడుతూ గర్భిణీలు, బాలింతలు, పిల్లలు పౌష్టిక ఆహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో టి.డబ్ల్యూ.ఓ జరీనా బేగం, సి.డి.పి.ఓ శైలజశ్రీ, ఎం.ఈ.ఓ కృష్ణయ్య, మెడికల్‌ఆఫీసర్లు శరత్‌చంద్ర, నరేష్ చంద్ర, ఐ.సి.డి.ఎస్ సూపర్వైజర్లు పాల్గొన్నారు.

## అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్ల పట్టివేత

**మహబూబ్‌నగర్(చిన్న చింతకుంట), అక్టోబరు 8 ప్రభాతవార్త :** మండలంలోని పళ్ళమర్రి గ్రామ శివారులో గల ఎర్రగుట్ట నుంచి ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తున్న రెండు భారత్ బెంజ్ టిప్పర్లను పట్టుకున్నట్లు ఎస్సై కృష్ణ ఓబుల్ రెడ్డి తెలిపారు. మంగళవారం రాత్రి 11 గంటల ప్రాంతంలో పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా ఎర్నాల గేటు వద్ద అక్రమంగా మట్టి తరలిస్తున్న భారత్ బెంజ్ టిప్పర్లు టిఎస్ 38టి 2494, టిఎస్06 యుఇ 1449 నంబర్లు గల టిప్పర్ల యజమానులు పల్లమర్రికి చెందిన అనిల్ చారి, మరికల్ గ్రామానికి చెందిన చిన్న లక్ష్మయ్యల తోపాటు టిప్పర్లను పోలీస్ స్టేషన్ కు తరలించడం జరిగిందన్నారు. బుధవారం ఉదయం తహసిల్దార్‌కు అక్రమంగా మట్టి తరలిస్తున్న టిప్పర్లను అప్పజెప్పడం జరిగిందన్నారు. ఎవరైనా అక్రమంగా మట్టి, ఇసుకను తరలిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.


పోలీసులు పట్టుకున్న రెండు టిప్పర్లు

# రైతు సంక్షేమంలో నాగర్‌కర్నూల్ ముందంజ

(మొదటి పేజీ తరువాయి)

విజయవంతంగా అమలు చేయగలమని కలెక్టర్ విశ్వాసం వ్యక్తం చేశారు. ఈ నెల 11వ తేదీన ప్రధాన మంత్రి ప్రారంభించనున్న కార్యక్రమం కోసం పాలెం వ్యవసాయ విశ్వవిద్యాలయంలో విస్తృత ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. మన జిల్లా ఈ కార్యక్రమం అమలులో అగ్రగామిగా నిలిస్తే, రైతులకు శాశ్వతమైన ఆర్థిక స్థిరత్వం మరియు అభివృద్ధి దిశగా కొత్త మార్గాలు తెరుచుకుంటా యని కలెక్టర్ బాదావత్ సంతోష్ అన్నారు. అంతకుముందు బుధ వారం దేశ రాజధాని ఢిల్లీ నుండి తెలంగాణ రాష్ట్రంలోని ప్రధాన మంత్రి ధన్‌ధాన్య కృషి యువజన పథకానికి ఎంపిక చేసిన నాగర్ కర్నూల్, నారాయణపేట, గద్వాల్, జనగాం జిల్లాల కలెక్టర్లు, వ్యవసాయ అధికారులతో భారత వ్యవసాయ మంత్రిత్వ శాఖ కార్య దర్శి దివేస్ చతుర్వేది,ధన్‌ధాన్య కృషి యువజన పథకం విధివిధానాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా భారత వ్యవసాయ మంత్రిత్వ శాఖ కార్యదర్శి దివేస్ చతుర్వేది మాట్లాడుతూ భారతదేశ వ్యవసాయ రంగాన్ని మరింతగా అభివృద్ధి పరిచి, రైతులకు ప్రయోజనం చేకూరేలా ఇప్పటికే ఉన్న 36 పథకాలను విలీనం చేసి, వ్యవసాయ రంగాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు ప్రధానమంత్రి ధన్‌ధాన్య కృషి యోజన పథకాన్ని భారతదేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈనెల 11న ప్రారంభం చేయనున్నట్లు ఆయన తెలిపారు. సంవత్సరానికి రూ.24,000 కోట్ల వ్యయంతో ఈ పథకం ఆరు సంవత్సరాల పాటు అమలులో ఉంటుందని, దేశవ్యాప్తంగా 100 వెనుకబడిన జిల్లాల ఎంపిక చేసినట్లు ఆయన తెలిపారు. నాగర్‌కర్నూల్ కలెక్టో ఒట్ నుండి ఈ వీడియో కాన్ఫరెన్స్ సమావేశానికి జిల్లా కలెక్టర్ బాదావత్ సంతోష్, జిల్లా వ్యవసాయ అధికారి యశ్వంత్ రావు, జిల్లా ఉద్యాన శాఖ అధికారి వెంకటేశం, జిల్లా నీటిపారుదల శాఖ అధికారి మురళి, వ్యవసాయ అధికారి నీతి, ఇతర శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.




వీడియో కాన్ఫరెన్స్‌లో వ్యవసాయ మంత్రిత్వ శాఖ కార్యదర్శి దివేస్ చతుర్వేది

## వృద్ధులకు సేవలందించడం అభినందనీయం

### -జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ నసీం సుల్తానా




**కల్వకుర్తి, అక్టోబర్ 08 ప్రభాతవార్త:** వృద్ధులకు అందించడం అభినందనీయమని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ నసీం సుల్తానా అన్నారు. కల్వకుర్తి పట్టణంలో డిడబ్ల్యూఓ, ప్రజల భాగస్వామ్య సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వృద్ధాశ్రమాన్ని బుధవారం జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ నసీం సుల్తానా సందర్శించారు. వృద్ధులకు పండ్లు, బిస్కెట్లు ఆమె పంపిణీ చేశారు. అనంతరం వృద్ధాశ్రమంలో జరిగిన న్యాయ విజ్ఞాన సదస్సులో జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ నసీం సుల్తానా మాట్లాడారు. వృద్ధాప్యంలో ఉన్న వారిని చేరదీసి, ఆదరించడం అభినందనీయమని పేర్కొన్నారు. వృద్ధులకు ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని ఆమె సూచించారు. వృద్ధుల హక్కులను కాపాడడంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ నసీం సుల్తానా పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వృద్ధాశ్రమ నిర్వాహకులు పీ.వెంకటయ్య, వృద్ధాశ్రమ కోఆర్డినేటర్ బీ.పద్మ, యోగా టీచర్ సునంద, సిబ్బంది రజిత, వృద్ధులు, పలువురు సిబ్బంది, తదితరులు ఉన్నారు.

## లంబాడీలపై అవాకులు చెవాకులు పేలితే ఊరుకోం



సమావేశంలో మాట్లాడుతున్న ఎల్‌హెచ్‌పిఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బాణావత్ శంకర్

**వెల్దండ, అక్టోబర్ 08 ప్రభాతవార్త:** లంబాడీలపై అవాకులు చెవాకులు పేలితే చూస్తూ ఊరుకోమని ఎల్‌హెచ్‌పిఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ బాణావత్ శంకర్ నాయక్ అన్నారు. బుధవారం మండల కేంద్రంలోని గిరిజన భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ లంబాడీలు, ఆదివాసుల మధ్య చిచ్చు పెడుతున్న తుడుం దెబ్బ రాష్ట్ర అధ్యక్షులు మైపతి అరుణ్ కుమార్, సోయం బాబురావు, తెల్లం వెంకట్రావ్‌లపై రాజ్యాంగ సంస్థలు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రజా కోర్టులో వీరికి శిక్ష తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో గిరిజన నాయకులు కాడురామ్‌నాయక్, పంతులనాయక్, వెంకట్రాంనాయక్, లక్ష్మణ్‌నాయక్, ఝాన్సీ రామ్‌నాయక్, నారాయణనాయక్, శ్రీనునాయక్, జైరామ్‌నాయక్, శ్రీనునాయక్, రవినాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మాజీ ఎంపిటిసి కుటుంబానికి పరామర్శ



మాజీ ఎంపిటిసి కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

**మహబూబ్‌నగర్(చిన్న చింతకుంట), అక్టోబరు 8 ప్రభాతవార్త :** మండలంలోని లాల్కోట మాజీ ఎంపిటిసి కోటగడ్డ వెంకటన్న మాతృమూర్తి కోటగడ్డ ఆశమ్మ సోమవారం మృతి చెందడంతో దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి బుధవారం మాజీ ఎంపీటీసీ కుటుంబాన్ని పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చి మనోధైర్యాన్ని ఇచ్చారు. పరామర్శించిన వారిలో పార్టీ మండల అధ్యక్షులు కోట రాము, మాజీ ఎంపీపీ హర్షవర్ధన్ రెడ్డి, నాయకులు వేణుగోపాల్, వట్టెం రాము, దశరథ్ రెడ్డి ,మల్లెల బాలరాజ్, కురుమూర్తి, శ్రీనివాస్ గౌడ్, చెన్నగౌడు, వెంకటరామ్ గౌడ్, రాజకుమార్, గోపాల్, రవి తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పార్టీ గెలుపు కోసం ప్రతి కార్యకర్త కృషి చేయాలి

### మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్ రెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

**నారాయణ పేట, అక్టోబరు8 ప్రభాతవార్త:** నారాయణపేట జిల్లాలోని మరికల్ మండలం జిన్నారం గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామోహన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ విజయానికి ప్రతి నాయకుడు కార్యకర్త కృషి చేయాలని పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతానికి గ్రామ స్థాయిలో ఐక్యంగా పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## గర్భిణులు ఆరోగ్యంగా ఉండాలి : ఎంపీడీవో

**మహబూబ్‌నగర్, అక్టోబర్ 8, ప్రభాతవార్త:** గర్భిణీలు, బాలింతలు, పిల్లలు పౌష్టిక ఆహారం తీసుకొని ఆరోగ్యంగా ఉండాలని ఎం.పీ.డీ.వో కరుణశ్రీ సూచించారు. పోషణ్ మాసం కార్యక్రమంలో భాగంగా మహబూబ్నగర్ రూరల్ ప్రాజెక్ట్ కార్యక్రమం నిర్వహించారు. గర్భిణులు ఆరోగ్యకరమైన ఆహారం తీసుకోవాలని, అప్పుడు తల్లీ బిడ్డా క్షేమంగా, ఆరోగ్యంగా ఉంటారని తెలిపారు. కార్యక్రమానికి టి.డబ్ల్యూ.ఓ జరీనా బేగం, సి.డి.పి.ఓ శైలజశ్రీ, ఎం.ఈ.ఓ కృష్ణయ్య, మెడికల్ ఆఫీసర్లు శరత్ చంద్ర, నరేష్ చంద్ర, ఐ.సి.డి.ఎస్ సూపర్వైజర్లు పాల్గొన్నారు.

## సామాజిక సేవ ఓ బాధ్యత

### - పీయూ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ కె. ప్రవీణ్

**మహబూబ్‌నగర్,అక్టోబరు8,ప్రభాతవార్త:** జాతీయ సేవా పథకం ద్వారా పర్యావరణాన్ని పరిరక్షించవచ్చని పాలమూరు యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ డాక్టర్ కె. ప్రవీణ్ అన్నారు. పాలమూరు యూనివర్సిటీలో ఎన్ఎస్ఎస్ యూనిట్స్ 1, 5, 8 ఆధ్వర్యంలో ఏడు రోజుల ప్రత్యేక శిబిరం క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ఉత్సాహంగా కొనసాగుతోంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ప్రవీణ్ మాట్లాడుతూ జాతీయ సేవా పథకం విద్యార్థుల్లో సామాజిక బాధ్యతను పెంపొందిస్తుందని, పర్యావరణ పరిరక్షణ మనందరి బాధ్యతని తెలిపారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు డాక్టర్ ఎస్. రవికుమార్, డాక్టర్ శివకుమార్ సింగ్, డాక్టర్ జ్ఞానేశ్వర్, సబోర్డినేట్ యాదయ్య లతో పాటు ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు చురుకుగా పాల్గొన్నారు.




## ప్రధాన మంత్రి ధన్ ధాన్య కృషి యోజన పై వీడియో కాన్ఫరెన్స్

**నారాయణ పేట, అక్టోబరు 8 ప్రభాతవార్త :** కేంద్ర వ్యవసాయ మంత్రిత్వ శాఖ నీతి ఆయోగ్ ఆధ్వర్యంలో ప్రధాన మంత్రి ధన్ ధాన్య కృషి యోజన పై వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ రాష్ట్రం నుండి నారాయణపేట జిల్లా ఎంపిక కావడంతో జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ ఈ వీసీలో పాల్గొన్నారు. కేంద్ర వ్యవసాయ రైతు సంక్షేమ శాఖ కార్యదర్శి దేవేష్ చతుర్వేది పథక లక్ష్యాలను వివరించారు. ఈ పథకం ద్వారా వ్యవసాయ ఉత్పాదకత పెంపు పంట వైవిధ్యీకరణ స్థిరమైన వ్యవసాయ పద్ధతుల ప్రోత్సాహం నీటిపారుదల సౌకర్యాల అభివృద్ధి రుణ లభ్యత సులభతరం చేయడం జరుగుతుందని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని వ్యవసాయ అనుబంధ కార్యక్రమాలను సమన్వయంతో అమలు చేయాలని సూచించారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ సిక్తా పట్నాయక్ సంబంధిత శాఖల అధికారులతో సమావేశమై దిశానిర్దేశం చేశారు. పిఎమ్ డీడీకేవై కార్యక్రమానికి నారాయణపేట జిల్లా ఎంపికైనందున సమన్వయంతో పనిచేసి యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని ఆమె సూచించారు. జిల్లాను కార్యక్రమ అమలులో ఆదర్శంగా నిలపాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ వీసీలో జిల్లా వ్యవసాయ అధికారి డీఆర్‌డిఓ మొగులప్ప ఇతర అధికారులు పాల్గొన్నారు.



విడియో కాన్ఫరెన్స్‌కు హాజరైన జిల్లా కలెక్టర్

## రాకపోకలకు ఇబ్బందులు

**మహబూబ్‌నగర్ (నవాబుపేట), అక్టోబరు 8 ప్రభాతవార్త :** మండల పరిధిలోని తీగలపల్లి సరిహద్దు దగ్గర నివి ఫార్మ్ రిసార్ట్ లోని స్విమ్మింగ్ పూల్, డ్రైనేజీ వేస్టేజ్ నీటిని అడ్డదిడ్డంగా రోడ్డుపైకి వదులుతుండడంతో ఆ నీటికి రోడ్డు మొత్తం బురద మయంగా గుంతలు ఏర్పడి ప్రజల రాకపోకలకు రోడ్డు మూడు ఫీట్ల రోతల గుంతలు ఏర్పడి నరకప్రాయంగా మారింది. ఫలితం గా కనీసం వాహనాల మీద కాకుండా నడిచి వెళ్లాలన్నా కూడా నరకప్రాయంగా అనిపిస్తుంది. ద్విచక్ర వాహనాలపై కూడా వెళ్లే ప్రజలకు చంటి పిల్లలను భార్య పిల్లలను బండి పైనుంచి దించి వాహనాన్ని ముందుకు కదిలించలేని స్థితిలో నీవి ఫార్మ్ రిసార్ట్ దగ్గర నరకప్రాయంగా రోడ్డు అస్తవ్యస్తంగా తయారయింది. వారం క్రితం ఇచ్చిన వార్తాపత్రిక కథనానికి కూడా జిల్లా అధికారులు కలెక్టర్, మండలాధికారులు కూడా అటువైపు చూడకపోవడంతో నివీ ఫార్మ్ యాజమాన్యం ఇష్టారాజ్యంగా దర్జాగా రోడ్డుపైకి వదు లుతున్నారు. చుట్టుపక్కల గ్రామస్తులు ఆ రోడ్డు మార్గం గుండా వెళ్లాలంటే చాలా కష్టంగా ఉందని ముందే మట్టి రోడ్డు, ఆపై ఈ రిసార్ట్ వాళ్లు కూడా రోడ్డుపైకే వేస్టేజ్ వాటర్ ను వదులు తుండటంతో నీటితో వృధా మయంగా మారి చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని బాటసారులు వాహనదారులు చుట్టుపక్కల గ్రామస్తులు వాపోతున్నారు. అధికారులు గమనించి మినీ ఫామ్స్ యజమాన్యంపై చర్యలు తీసుకొని నీటిని రోడ్డుపైకి వదలకుండా చర్యలు తీసుకోవాలని కోరుకుంటున్నారు.



రిసార్టులోని నీరు రోడ్డుపై పారుతున్న దృశ్యం

## ఆల్ ఇండియా పోలీస్ రెజ్లింగ్‌లో కాంస్యం

### - పీసీ రాధికను అభినందించిన ఎస్పీ జనకీ

**మహబూబ్‌నగర్, అక్టోబరు8,ప్రభాతవార్త:** 74వ ఆల్ ఇండియా పోలీస్ రెజ్లింగ్ క్లస్టర్‌లో కాంస్య పతకం సాధించిన విమెన్ పీసీ రాధిక ను జిల్లా ఎస్పీ డి. జానకి సన్మానించారు. 74వ ఆల్ ఇండియా పోలీస్ రెజ్లింగ్ క్లస్టర్ (ఆర్మ్ రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్)–2025–26 హర్యానా రాష్ట్రంలో సెప్టెంబర్ 20 నుండి 24 వరకు జరిగింది. ఈ పోటీలలో తెలంగాణ పోలీస్ బృందం తరపున పాల్గొన్న మహబూబ్‌నగర్ జిల్లా అడ్డాకల్ పోలీస్ స్టేషన్ కు చెందిన మహిళా కానిస్టేబుల్ రాధిక 80+ కేటగిరీలో అద్భుత ప్రతిభ కనబరుస్తూ, ఎస్ఎం బీ ప్లేయర్ సాంగీత పై పోరాటం చేసి కాంస్య పతకం సాధించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డి.జానకి రాధిక విజయంపై హర్షం వ్యక్తం చేస్తూ, ఆమెను తన చాంబర్‌లో శాలువా కప్పి అభినందించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ రాధిక చూపిన కృషి, పట్టుదల మరియు క్రీడాస్ఫూర్తి ఇతర పోలీస్ సిబ్బందికి ఆదర్శప్రాయంగా నిలుస్తాయి. తెలంగాణ పోలీస్ శాఖలో మహిళా సిబ్బంది క్రీడా రంగంలోనూ ప్రతిభ చాటడం ఎంతో గర్వకారణం," అని పేర్కొన్నారు. భవిష్యత్తులో రాధిక జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.




రాధిను సన్మానిస్తున్న ఎస్పీ జానకీ

## విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధన చేయాలి

### వనపర్తి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ఎర్ర అంజయ్య

**శ్రీరంగాపూర్, అక్టోబరు 8 ప్రభాతవార్త :** శ్రీరంగాపూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను బుధవారం వనపర్తి జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ఎర్ర అంజయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. సిబ్బంది హాజరు రిజిస్టర్, విద్యార్థుల హాజరు రిజిస్టర్లు,టీచింగ్ డైరీలు, అన్ని ఆఫీసర్ రికార్డులను పరిశీలించడం జరిగింది. కళాశాల లెక్చరర్లతో సమావేశం ఏర్పాటు చేసి విద్యార్థు లకు నాణ్యమైన విద్యను ఇన్నో వేటివ్ ఆలోచనలతో విద్య బోధన చేయాలని, మంచి ఫలితాలు సాధిం చాలని కోరారు. విద్యార్థిని విద్యార్థులతో జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో కళాశాల ప్రిన్సిపాల్ ఇ.జె మోజెస్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన అవగాహన సదస్సులు డిఆర్‌డిఓ వనపర్తి జిల్లా ఉమాదేవి, దీనివీ అంజయ్య మాట్లాడుతూ గ్రామాల్లో స్నేహ గ్రూప్ల ద్వారా విద్యార్థులు చదువు తోపాటు వివిధ ఇన్నోవేటివ్ ఆలోచనలతో స్టార్టప్‌లు ప్రారంభిం చాలని వివిధ అంశాలలో నైపుణ్యం పొందాలని చిన్నచిన్న వ్యాపార సంస్థలు నెలకొల్పు కోవాలని తెలియజేశారు. విద్యార్థులు మీ మీ జీవితంలో మంచి లక్ష్యాన్ని పెట్టుకుని చదవాలని సూచిం చారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఇ.జెమోజస్ హైదరాబాదు ఎఎల్‌ఇఎపి సంస్థ ప్రతి నిధులు మాధవి, కాసిం కళాశాల లెక్చరర్స్, నాన్ టీచింగ్ సిబ్బంది పాల్గొనడం జరిగింది.



మాట్లాడుతున్న జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి ఎర్ర అంజయ్య

### తాగి వేధిస్తున్నాడని..

## భర్తను హతమార్చిన భార్య

- తమ్ముళ్లతో కలిసి పక్కా ప్లాన్
- ఐదుగురు నిందితులు అరెస్ట్, రిమాండ్‌కు తరలింపు
- వివరాలను వెల్లడించిన వనపర్తి డిఎస్పి వెంకటేశ్వరరావు

**వనపర్తి క్రైమ్, అక్టోబరు 8 ప్రభాతవార్త:** తాగి వేధిస్తున్నాడని సొంత తమ్ముళ్లతో కలిసి భర్తను హతమార్చిన ఘటనను నాలుగు రోజుల్లో చేధించి నిందితులను అరెస్ట్ చేశామని డిఎస్పీ వెంకటేశ్వర్లు వెల్లడించారు. బుధవారం వనపర్తి పట్టణ సిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం... వనపర్తి జిల్లా రేవల్లి మండలంలోని చెన్నారం గ్రామంలో సంఘటన చోటు చేసుకుందన్నారు. కొన్ని నెలలపాటు తాగుడుకు బానిసై ఏ పని చేయకుండా ఇంటి దగ్గరే ఉంటూ భార్య శివలీల సంపాదించిన డబ్బులు తాగడానికి ఇవ్వట్లేదని బాగా వేధిస్తున్నాడని మనస్థా పానికి గురై ఎంత చెప్పినా వినకపోవడంతో తాళి కట్టిన భర్తనే చంపాలని నిర్ణయించుకుంది. అందుకు కసాయిగా మారిన శివలీల సొంత తమ్ములతో చర్చించి ఇంటికి రప్పించుకొని మరీ పథకం ప్రకారం చంపినట్లు వారు ఒప్పుకున్నట్లు తెలిపారు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న కొన్ని వస్తువులు, హత్య చేసినప్పుడు వాడిన ఆయుధాలను వారు స్వాధీనం చేసుకు న్నారు. తక్కువ సమయంలోనే ఈ కేసును చేధించడంతో సిఐ కృష్ణయ్య, రేవల్లి ఎస్సై రజిత, హెడ్ కానిస్టేబుల్ నాగేష్, చంద్రశేఖర్, మౌలానా, ఆంజనేయులు, రామకృష్ణ పలువురిని డిఎస్పి ప్రత్యేకంగా అభినందించారు.

## పిల్లలను అక్రమ రవాణా చేస్తే చర్యలు

### ఎస్సై వెంకటేశ్వర్లు గౌడ్

**లింగాల, అక్టోబరు 8 ప్రభాతవార్త:** పిల్లలను అక్రమ రవాణా చేస్తే చర్యలు తప్పవని లింగాల ఎస్సై వెంకటేశ్వర్లు గౌడ్ వాహన దారులను హెచ్చరించారు. బుధవారం లింగాల మండల పరిధిలోని బాకారం కోమటికుంట ఎక్స్ రోడ్డులో వాహనాల తనిఖీలు నిర్వ హించారు. దసరా సెలవులు ముగిసి పాఠశాలలు ప్రారంభం కావడంతో విద్యార్థులు పాఠశాలకు వెళ్లాలని కానీ పత్తి చేల పనికి వాహనదారులు ప్రతి రోజూ పిల్లలను తీసుకువెళ్తున్నారు. ప్రతిరోజు వాహనాలను తనిఖీలు చేసి పరిమితి కన్నా ఎక్కువ మంది, పిల్లల ను తరలిస్తే కేసు నమోదు చేస్తానని హెచ్చరించారు. కొల్లాపూర్, ఏల్లూరు, నార్లాపూర్, ముక్కిడి గుండం, ప్రాంతాల నుండి తెలకపల్లి మండలం జంగమోనిపల్లి,గోలగుండం, గౌరెడ్డిపల్లి తదితర ప్రాంతాలకు పిల్లలను పత్తి తీసేందుకు తీసుకువెళ్తుండగా 30 విద్యార్థులను తిరిగి పంపారు. ఇక నుంచి పిల్లలకి తీసుకొస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ బాలరాజు,కోనేరు స్వచ్ఛంద సంస్థ ఏరియా కోఆర్డినేటర్లు శ్రీనివాస్, జాకీర్ హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.



వాహనలను తనిఖీ చేస్తున్న ఎస్సై వెంకటేశ్వర్లు గౌడ్

## అనుమానమే ప్రాణం తీసింది




వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ లింగయ్య

**మక్తల్ టౌన్, అక్టోబరు 8 ప్రభాతవార్త :** భర్త తన భార్యను కత్తితో పొడిచి, గొంతుకోసి హత్య చేసిన ఘటనలో నిందితుడిని బుధవారం రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ నల్లపు లింగయ్య వెల్లడించారు. బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వివరాలు తెలిపారు.. మేడ్చల్, మల్కాజ్ గిరిలోని సైనిక్ పూరికి చెందిన నిందితుడు కృష్ణారెడ్డి (32) ప్రైవేటు ఉద్యోగి. 10 సంవత్సరాల క్రితం వినోదతో వివాహం జరిగింది. వారికి ఏకైక కుమారుడు లక్షిత్ రెడ్డి (8) ఉన్నాడు. ఇదిలా ఉండగా కృష్ణారెడ్డి 10, 15 రోజులకు ఒకసారి నెలలో రెండు, మూడు సార్లు భార్య, కొడుకు వద్దకు వచ్చి వెళ్లేవాడు. ఆమెపై అనుమానం పెరిగి వచ్చిన ప్రతిసారి గొడవ పెట్టుకుని వెళ్లేవాడు. కృష్ణారెడ్డి తన భార్యను ఎలాగైనా చంపాలని నిర్ణయించుకుని, రెండు మూడు సార్లు హత్య చేయడానికి ప్రయత్నించి విఫలమయ్యాడు. ఎలాగైనా ఆమెను చంపాలని పథకం ప్రకారం కత్తిని హత్య చేయాలని నిర్ణయించుకున్నాడు. దసరా పండుగ సందర్భంగా అందరూ కుటుంబ సభ్యులతో కలిసి పొలం వద్ద భోజనాలకు వెళ్దామని చెప్పి అక్కడ భోజనం చేశాక అందరూ వారి బండ్లపై తిరిగి వెళుతుండగా కృష్ణారెడ్డి తన స్కూటీలో గాలి తక్కువగా ఉందని వారిని నమ్మించి తన కొడుకుని అత్తవారి వెంట పంపాడు. అందరూ వెళ్లిపోయాక మార్గమధ్యలో సత్యవార్ గ్రామ శివారులో తన బండి ఆపి తన భార్య వినోదతో ఫోన్లో ఎవరితో మాట్లాడుతున్నావని గొడవపడి తనతో తెచ్చుకున్న కత్తిని తీసి ఆమెపై దాడి చేశాడు. భార్య గొంతు కోసి రక్తపు మడుగులో పడి ఉండడం చూసి వెంటనే అక్కడినుండి నుండి పరారైనాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు భూత్పూర్ ఎక్స్ రోడ్డు మహబూబ్ నగర్ లో నిందితుడిని స్కూటీతోపాటు పట్టుకొని పోలీస్ స్టేషన్ తీసుకువచ్చి విచారించగా ఈ నేరం చేసినట్లు నిందితుడు ఒప్పుకున్నాడు. కేసు దర్యాప్తు చేదించడంలో బాగా పనిచేసిన మక్తల్ సీఐ రామ్ లాల్, ఎస్సై భాగ్యలక్ష్మి రెడ్డి, మాగనూరు ఎస్సై అశోక్ బాబు, క్రైమ్ స్టాఫ్ అశోక్, నరేష్, శ్రీకాంత్, శశిధర్ గౌడ్, బీబి, శ్రీహరి గౌడ్‌లను డీఎస్పీ అభినందించి త్వరలో ఎస్పీ చేతుల మీదుగా రివార్డు ఇవ్వడం జరుగుతుందని డీఎస్పీ తెలిపారు.

## ఆగిన వలస ఊపిరి..

(మొదటి పేజీ తరువాయి)

వెళ్లి అక్కడ మేస్త్రీగా పనిచేస్తూ జీవనం సాగిస్తూ కుటుంబాన్ని పోషించేవాడు. కూతురు అనారోగ్యం కారణంగా కూతురుకు ఆరో గ్యం కోసం అప్పులు చేసి ప్రైవేట్ ఆస్పత్రిలో చూయించి కూతుర్ని బాగు చేయించుకున్నాడు. చేసిన అప్పులు తీర్చడానికి ముంబైకి వలస వెళ్లి మేస్త్రి పని చేసేవాడు. బుధవారం 14వ అంతస్తులో పనిచేస్తూ జరిగిన ప్రమాదంలో అక్కడికక్కడే మృతి చెందడం జరిగింది. దీంతో వారి కుటుంబంలో విషాద ఛాయలు అలుముకు న్నాయి. నిరుపేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామ స్తులు కోరుతున్నారు.

## వాగులో పడి వ్యక్తి మృతి

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, అక్టోబర్ 8 ప్రభాతవార్త:** వాగులో పడి వ్యక్తి మృతిచెందిన సంఘటన సిరసవాడ గ్రామ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే..తాడూర్ మండల పరిధిలోని సిరసవాడ గ్రామానికి చెందిన జంగయ్య (50) మంగళవారం రోజు మధ్యాహ్నం సమయంలో గ్రామానికి అనుసరించి ఉన్న దుందుభి వాగ్‌లోని చెక్ డ్యామ్‌పై నడుచుకుంటూవెళ్తుండగా ప్రమాదవశాత్తు వాగులో పడడంతో తలకు తీవ్ర గాయమైంది. ఆ సమయంలో చుట్టుపక్కల ఎవరూ లేకపోవడంతో ఈ విషయం బుధవారం ఉదయం శవం బయటకి తేలడంతో గ్రామస్తులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలానికి ఎస్ఐ సల్మాన్ పరిశీలించి పంచనామా నిర్వహించినట్టు తెలిపారు.

## మాదిగలకు మంత్రి పొన్నం క్షమాపణ చెప్పాలి

**దామరగిద్ద, అక్టోబరు 8 ప్రభాతవార్త :** దామరగిద్ద మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో పాత్రికేయ సమావేశంలో మండల ఉపాధ్యక్షులు యు. అశోక్ మాట్లాడుతూ నిన్న హైదరా బాద్‌లోని జూబ్లీహిల్స్ లో జరిగిన పాత్రికేయుల సమావేశంలో మంత్రి పొన్నం ప్రభాకర్ గౌడ్ మాదిగల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే విధంగా సహచర మంత్రి అయినా అడ్లూరి లక్ష్మణ్ ని కించపరిచే విధంగా మాట్లాడడాన్ని ఖండించారు. 24 గంటల్లో బహిరంగ క్షమాపణ చెప్పకుంటే పద్మ శ్రీ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకుఉమ్మడి జిల్లా వ్యాప్తంగా అన్ని మండల కేంద్రాలలో పొన్నం దిష్టిబొమ్మను దహనం చేసి తన కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. మాదిగలకు, డబ్బులు, పదవుల కన్నా ఆత్మగౌ రవమే ముఖ్యమని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తక్షణమే పొన్నం ప్రభాకర్ పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## మద్దూరులో ఘనంగా కాచెరువు కట్ట మైసమ్మ విగ్రహ ప్రతిష్టాపన

**మద్దూరు, అక్టోబరు 8 ప్రభాతవార్త :** మద్దూరు మున్సిపాలి కేంద్రంలో కాచెరువు కట్ట మైసమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవాలు బుధవారం ఘనంగా నిర్వహించారు. మద్దూరు కాచెరువు కట్టమీద నూతనంగా నిర్మించిన దేవాలయంలో వేద పండితుల మంత్రోచ్ఛారణల మధ్య ప్రతిష్టించారు. హాజరైన భక్తుల కోసం అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో జీడి వెంకట్ రాములు, పి.వెంకటప్ప. జీడి రామకృష్ణ, ప్రకాష్, భీమ్‌సేన్ తదితరులు పాల్గొన్నారు.